# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - ఆదివారం 21 జూన్ 2026 | సంపుటి: 10 | సంచిక: 167 | పేజీలు: 8+4 | వెల రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM |


## వన్డే సిరీస్ భారత్ కైవసం


8




## దుర్గమ్మ సేవలో రాందేవ్ బాబా



2




## ఇదీ రైతు ప్రభుత్వం



# ఆర్గానిక్ వ్యవసాయానికి పెద్దపీట

- పకృతి వ్యవసాయక్షేత్రాన్ని పరిశీలించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఆర్గానిక్ వేరుశనగ గానుగను సందర్శించిన సీఎం
- సతీమణి భువనేశ్వరితో ఫోన్లో మాట్లాడి కోల్డ్‌ప్రెస్డ్ వేరుశనగ కొనుగోలు
- ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతు నాగభూషణానికి సీఎం ప్రశంస

చిలకలూరి పేట నుండి పి.మీరాహుస్సేన్,మనం ప్రత్యేక ప్రతినిధి : అన్నదాత సుఖీభవ కార్యక్రమం సందర్భంగా పల్నాడు జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు. లింగంగుంట్లలో ప్రకృతి వ్యవసాయం చేస్తోన్న రైతు గుడిపల్లి నాగభూషణంకు చెందిన పొలాన్ని ...మిగతా 2లో

## అన్నదాతకు అండగా 'అన్నదాత సుఖీభవ'

- సీఎం చంద్రబాబు నాయకత్వంలో వ్యవసాయ రంగానికి పునర్వైభవం
- వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం
- గత ప్రభుత్వ వైఫల్యాలతో దెబ్బతిన్న రంగాలను తిరిగి బలోపేతం చేస్తున్నాం
- అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ సమన్వయం చేస్తున్నాం
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



అమరావతి/ చిలకలూరిపేట, జూన్ 20: రైతు సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న 'అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్' పథకం ద్వారా రాష్ట్రంలోని లక్షలాది రైతు కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట నియోజకవర్గంలోని లింగంగుంట్ల గ్రామంలో శనివారం నిర్వహించిన అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ నిధుల విడుదల కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, రైతుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ...మిగతా 2లో

## విద్యార్థుల విద్య, ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

### ఎంపీ కేశినేని చిన్ని



2

## టీటీడీ ఆర్డర్‌తో ఉపాధి, వెంకన్నకు సేవ

రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత



2

## యోగాతో సమాజం ఆనందంగా.. సుసంపన్నంగా..



- యోగాను ప్రతిఒక్కరూ ప్రతిరోజూ ఆచరించాలి
- జీవనశైలి వ్యాధులను ఎదుర్కొనే మహత్తర శక్తికి యోగాకుంది
- యోగా పోటీల్లో విజేతలకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను
- ప్రభుత్వ చొరవలో విజేతలు కూడా భాగస్వాములు కావాలి
- రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

విజయవాడ,జూన్, 20,మనం న్యూస్ః రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో విజేతలుగా నిలిచినవారికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని.. మన ప్రాచీన భారతీయ సంస్కృతికి, జీవన విధానానికి యోగా ఒక ప్రతీక అని.. మన మునులు, రుషులు వారి విజ్ఞానాన్ని, అనుభవాన్ని రంగరించి యోగాను మనకు వారసత్వ సంపదగా అందించారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు.యోగాంధ్ర-2026లో భాగంగా గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో ...మిగతా 2లో

## ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత


- సమాచార పౌర సంబంధాల శాఖామంత్రి పార్థసారధి




ఆగిరిపల్లి/ఏలూరు, జూన్, 20,(మనం న్యూస్) : రాష్ట్రంలో సంజీవని కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో ఏటా 60 లక్షల మంది ప్రజలకు 41 రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్య వివరాలను ఆన్లైన్ లో పొందుపరచడం జరుగుతుందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఆగిరిపల్లి మండలం నెక్కలం గొల్లగూడెంలో పారిశుద్ధ్య కార్యక్రమంలో అధికారులతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారధి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు, ఆరోగ్య భద్రతకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తోందన్నారు. రాష్ట్రంలో 104 వాహనాల మాదిరిగా 904 వాహనాలలో మారుమూల గ్రామాలలోని ప్రజలవద్దకు వెళ్లి సుమారు. రూ.7 వేల నుండి రూ.10 వేల విలువచేసే వైద్య పరీక్షలు నిర్వహించి, వాటి వివరాలను ఆన్లైన్ లో పొందుపరుస్తారని అందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రజలెవరైనా అనారోగ్యానికి గురైనప్పుడు ...మిగతా 2లో

## వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజనలో..

# 70 లక్షల మందికి ఉద్యోగాలు



- బెంగాల్ సంకెళ్లు వీడాయి
- ప్రధాని నరేంద్ర మోడీ

ఢిల్లీ/ కోల్‌కతా, జూన్ 20: 'ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన' (పీఎం-వీబీఆర్‌వై) కింద దేశంలో ఇప్పటివరకు 70 లక్షల మందికిపైగా యువత ఉద్యోగాలు పొందారని ప్రధాని మోదీ తెలిపారు. తొలిసారి ఉద్యోగాలు పొందినవారికి, వారి యజమానులకు రూ.2,400 కోట్ల ప్రోత్సాహకాలను ఆయన బదలాయించారు. ప్రభుత్వం, యువత, పరిశ్రమలు కలిసి పనిచేస్తే ఉద్యోగాలు అనేకరెట్ల మేర పెరుగుతాయని మోదీ చెప్పారు. ''ఈ పథకం ద్వారా ఉద్యోగాలతో లబ్ధిదారులకు సామాజిక భద్రత లభించింది. కొత్తగా ఉద్యోగాలు సృష్టించే సంస్థలను, యజమానులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. యువతకు-పరిశ్రమలకు మధ్య వారధిలా ఈ పథకం నిలుస్తుంది. యువత నైపుణ్యాలు, ఆకాంక్షలు, శక్తిసామర్థ్యాలు వికసిత భారత్‌కు మార్గం సుగమం చేస్తాయి'' అని వివరించారు. తృణమూల్ కాంగ్రెస్, ప్రతిపక్ష పార్టీలపై ప్రధాని నరేంద్ర మోడీ తీవ్ర విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వాల హయాంలో బందీగా ఉన్న బెంగాల్ సంకెళ్ల నుంచి విముక్తి పొందిందని అన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి సీఎం సువేందు అధికారి నేతృత్వంలోని ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. బెంగాల్ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. గతంలో రక్తపాతాన్ని, ప్రాణనష్టాన్ని చవిచూసినప్పటికీ బెంగాల్ తన అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని కోల్పోలేదని ప్రధాని పేర్కొన్నారు. దేశ విభజన సమయంలో రాష్ట్రాన్ని భారత్ నుంచి విడదీయడానికి కాంగ్రెస్ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను విస్మరించినందుకు ప్రజలు కాంగ్రెస్కు, టీఎంసీకి తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. ఒకే ఒక్క ఎన్నికల తీర్పు తెచ్చిన మార్పు రాష్ట్రవ్యాప్తంగా స్పష్టంగా కనిపిస్తోందన్నారు.

భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు వెంబడి కంచె ఏర్పాటుకు టీఎంసీ ప్రభుత్వం భూమిని కేటాయించలేదని ప్రధాని దుయ్యబట్టారు. ఓటుబ్యాంకు కోసం చొరబాటుదారులను రాష్ట్రంలోకి మమత అనుమతించారని ఆరోపించారు. ఈ సమస్యను పరిష్కరించడానికి అధికారంలోకి వచ్చిన వెంటనే సరిహద్దుల్లో కంచె ఏర్పాటుకు భాజపా ప్రభుత్వం భూమిని కేటాయించిందన్నారు.

## ఇది 'ఎగిరే వైట్‌హౌస్'

ఖతార్, జూన్ 20: ఖతార్ పాలకులు తనకు గిఫ్ట్‌గా ఇచ్చిన 747 జంబో జెట్ విమానాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆవిష్కరించారు. ఇకనుంచి ట్రంప్ కొంతకాలం పాటు ఇందులోనే ప్రయాణాలు చేయనున్నారు. ఈ విమానాన్ని ఆయన 'ఎగిరే వైట్‌హౌస్‌గా'గా అభివర్ణించారు. జాయింట్ బేస్ ఆండ్రూస్‌లో శుక్రవారం ఈ విమానం ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది.

ఇది ప్రపంచంలోనే అత్యంత విలాసవంతమైన విమానం అని ట్రంప్ పేర్కొన్నారు. ఇందులోని ఇంటీరియర్ డిజైన్, ఇంజిన్ల నాణ్యత అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు.



## నౌకాదళం.. మరింత బలోపేతం

ప్రధాని చేతుల మీదుగా జాతికి అంకితం

2






## విదేశాల్లోనూ 'లేపాక్షి' ఏర్పాటు

- నేతన్నలు, హస్త కళాకారులు గౌరవప్రద జీవనమే లక్ష్యం
- ఉచిత విద్యుత్ తో చేనేత కుటుంబాల్లో వెలుగులు
- క్లస్టర్లు, మెగా క్లస్టర్ల ఏర్పాటుతో నిత్య ఉపాధి
- ఆప్కో, లేపాక్షిషోరూమ్ ల ప్రక్షాళన
- ఆప్కో డిజిటైలేజేషన్ కు స్కోచ్ అవార్డు రాక
- త్వరలో నేతన్న భరోసా పథకానికి శ్రీకారం
- రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత

2

# ఇదీ రైతు ప్రభుత్వం ఆర్గానిక్ వ్యవసాయానికి పెద్దపీట..



(మొదటి పేజీ తరువాయి)

శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతు నాగభూషణం తాను చేపడుతున్న ప్రకృతి వ్యవసాయ విధానాన్ని సీఎం చంద్రబాబుకు వివరించారు. గత నాలుగేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నామని నాగభూషణం తెలిపారు. ప్రకృతి వ్యవసాయం వల్ల పెట్టుబడి వ్యయం తగ్గడంతో పాటు భూసారం, దిగుబడులు పెరిగి వ్యవసాయం లాభాదయకంగా మారిందని సీఎంకు వివరించారు. రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నామని... రసాయనాల వల్ల కలిగే నష్టాలపై రైతుల్లో అవగాహన కల్పిస్తున్నామని సీఎం చెప్పారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా తనకు కలిగిన లబ్ధిని, ప్రయోజనాలను నాగభూషణం ముఖ్యమంత్రికి వివరించారు. నాగభూషణం లాంటి రైతులే ప్రకృతి వ్యవసాయానికి ఆదర్శంగా నిలుస్తారని సీఎం చంద్రబాబు అన్నారు. ఇదే సమయంలో నాగభూషణానికి చెందిన గానుగను కూడా ముఖ్యమంత్రి పరిశీలించారు. వేరుశనగ, నువ్వులు, కొబ్బరి తదితర నూనెగింజలను సహజ పద్ధతిలో గానుగ ద్వారా నూనె ఉత్పత్తి చేస్తున్నట్టు నాగభూషణం వివరించారు. గానుగ ఏర్పాటు అదనపు ఆదాయ వనరుగా మారిందని, ఇటువంటి సంప్రదాయ ఆధారిత పరిశ్రమలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తాయని సీఎం అభిప్రాయపడ్డారు. తాము ఉత్పత్తి చేస్తున్న కోల్డ్ప్రెస్డ్ వేరుశెనగ నూనెను అనేక మందికి సరఫరా చేస్తున్నామని, మీరు కూడా వినియోగించాలని ముఖ్యమంత్రిని నాగభూషణం కోరారు. ఇంట్లో ఏదైనా వస్తువులు కొనుగోలు చేయాలంటే తన సతీమణి భువనేశ్వరిని అడగాలంటూ అక్కడి నుంచే ఆమెకు ఫోన్ చేసి మాట్లాడి ఒక లీటరు వేరుశనగ నూనెను సీఎం చంద్రబాబు కొనుగోలు చేశారు.

### వివిధ రకాల పంటల సాగుతో మెరుగవుతున్న జీవ వైవిధ్యం

అనంతరం ముఖ్యమంత్రి గో ఆధారిత ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని సందర్శించారు. జీవామృతం, ఘన జీవామృతం, వేపాస్త్రం వంటి సహజ వ్యవసాయ ఉత్పాదనలను స్థానికంగా లభించే వనరులతో తయారు చేసి రైతులకు అందజేస్తున్న విధానాన్ని సీఎం చంద్రబాబు పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం చేసేందుకు రైతులకు శిక్షణ, ప్రదర్శనలు, సాంకేతిక సహాయాన్ని కూడా ఈ కేంద్రం అందిస్తోందని నాగభూషణం చెప్పారు. ఆ తర్వాత బొప్పాయి తోటను పరిశీలించి..రైతు అందించిన బొప్పాయి పండును సీఎం తిన్నారు. బొప్పాయితో పాటు ఇతర పంటలను సాగుతో జీవ వైవిధ్యం పెరగడంతో పాటు భూసారం, తేమ నిల్వ సామర్థ్యం మెరుగుపడుతోందని రైతు వివరించారు. చీడపీడల నివారణకు కూడా ఇది దోహదపడుతోందని నాగభూషణం సీఎం చంద్రబాబుకు వివరించారు.

## విద్యార్థుల విద్య, ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

**విజయవాడ పశ్చిమ జూన్ 20 (మనం న్యూస్ )** విద్యార్థుల విద్యా వికాసం, ఆరోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. పశ్చిమ నియోజకవర్గంలోని 50వ డివిజన్ అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించిన ఆయన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి ఆహార నాణ్యత, పరిశుభ్రత, వారికి అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ''అమ్మ ఒడి మానవ జననానికి గర్భగుడైతే, తరగతి గది మానవ గమనానికి గర్భగుడి'' అని పేర్కొన్నారు. నేటి విద్యార్థులే రేపటి భారత నిర్మాణ శిల్పులని, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ప్రభుత్వంతో పాటు ఉపాధ్యాయులపై కూడా ఉందన్నారు. విద్యార్థుల భవిష్యత్తు బలోపేతానికి నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్యం, పోషకాహారం కూడా ఎంతో అవసరమని తెలిపారు.పోషకాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం విద్యార్థుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం తో పాటు వారి ఏకాగ్రత, విద్యా ప్రమాణాల పెరుగుదలకు దోహదపడుతుందని చెప్పారు. అందుకే అంగన్వాడీ నుంచి పాఠశాల స్థాయి వరకు నాణ్యమైన ఆహారం అందించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. పాఠశాలల్లో పరిశుభ్రత, మౌలిక వసతులు, విద్యా ప్రమాణాల మెరుగుదలపై అధికారులు నిరంతరం దృష్టి సారించాలని సూచించారు.

# దుర్గమ్మ సేవలో రాందేవ్ బాబా



**విజయవాడ ఇంద్రకీలాద్రి జూన్ 20 (మనం న్యూస్):** ప్రముఖ యోగా గురు బాబా రాందేవ్‌బాబా శనివారం సాయంత్రం ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో) శీనా నాయక్ ఘన స్వాగతం పలికారు.అనంతరం బాబా రామ్దేవ్ అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో దర్శనం చేసుకున్నారు. దర్శనానంతరం ఆలయ వేదపండితులు వేదమంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయాలను, అమ్మవారి మహిమను ఆయనకు వివరించారు. దేవస్థానం చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), ఈవో శీనా నాయక్లు బాబా రామ్దేవ్ను సన్మానించి అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాలపై కూడా చర్చించినట్లు అధికారులు తెలిపారు. బాబా రాందేవ్‌బాబా రాకతో ఇంద్రకీలాద్రిలో భక్తులు, సందర్శకుల్లో ఉత్సాహం నెలకొంది. ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి దర్శన కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించారు. యోగా, ఆధ్యాత్మికత ద్వారా భారతీయ సంస్కృతి విశిష్టతను ప్రపంచానికి చాటుతున్న బాబా రామ్దేవ్ దుర్గమ్మను దర్శించుకోవడం విశేషంగా నిలిచింది.

## యోగాతో సమాజం ఆనందంగా.. సుసంపన్నంగా..

(మొదటి పేజీ తరువాయి)

యోగా పోటీలు జరిగాయి. రాష్ట్రస్థాయి పోటీలు ఇబ్రహీంపట్నం మండలం, గుంటుపల్లి డాన్బోస్కో స్కూల్లో జరిగాయి. ఈ పోటీల్లో దాదాపు 1,600 మంది పాల్గొన్నారు. వీరిలో 108 మంది విజేతలుగా నిలిచారు. వీరికి శనివారం మంత్రి సత్యకుమార్ యాదవ్, శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్, సెకండరీ హెల్త్ డైరెక్టర్ కె.వి.ఎన్. చక్రధర్ బాబు, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ తదితరులు జ్ఞాపికలు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ మన ప్రాచీన ఘన వారసత్వ సంపదను విశ్వవ్యాప్తం చేసేందుకు ప్రధానమంత్రి మొదట్నుంచి విశేష కృషిచేస్తున్నారన్నారు. ఈ క్రమంలోనే ఏటా జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల కోట్లాది మంది ప్రయోజనం పొందుతున్నారన్నారు. యోగాతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, సృజనాత్మకత పెరగడమే కాకుండా ఏకాగ్రత కూడా పెరుగుతుందన్నారు. ఈ సంవత్సరం ఆరోగ్యకర వృద్ధాప్యానికి యోగా థీమ్తో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. ప్రతిరోజు 45 నిమిషాలు యోగాభ్యసనకు కేటాయించాలన్నారు. యోగాచరణతో డయాబెటిస్, హైపర్ టెన్షన్ వంటి జీవనశైలి వ్యాధులను కట్టడి చేయొచ్చన్నారు. ప్రజారోగ్యాన్ని సంరక్షించడంలో ప్రభుత్వం చేస్తున్న చర్యల్లో నేటి యోగాపోటీల విజేతలు కూడా భాగస్వామ్యం వహించాల్సిన అవసరం ఉందన్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందాన కాకుండా మనం మనల్ని కాపాడుకుంటూ మన కుటుంబాన్ని కాపాడుకుంటూ మన సమాజాన్ని కూడా కాపాడుకునే క్రమంలో ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు .శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా యోగాకు పెరుగుతున్న ఆదరణకు భారతదేశపు ప్రాచీన రుషులు, మునులు అందించిన జ్ఞానమే కారణమని పేర్కొన్నారు. యోగా సాధన వల్ల ఆరోగ్యం మాత్రమే కాకుండా మనసు, శరీరం మధ్య సమన్వయం ఏర్పడి మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, ఉత్సాహం పెరుగుతాయని వివరించారు. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ , రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు క్రమం తప్పకుండా యోగా సాధన చేస్తూ ప్రజాసేవలో నిరంతరం చురుగ్గా ఉండడం అందరికీ ఆదర్శమని అన్నారు. యోగా మనిషిలో క్రమశిక్షణను పెంపొందించి ప్రతి వ్యక్తి రోజుకు కనీసం ఒక గంట సమయం కేటాయించి యోగా సాధన చేస్తే ఆరోగ్యపరంగా, మానసికంగా మరింత దృఢంగా మారగలరని తెలిపారు. సెకండరీ హెల్త్ డైరెక్టర్ కె.వి.ఎన్. చక్రధర్ బాబు మాట్లాడుతూ.. యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన వారసత్వమని పేర్కొన్నారు. గత ఏడాది విశాఖపట్నంలో లక్షలాది మంది పాల్గొని రికార్డులు సృష్టించడం గర్వకారణమన్నారు.

## టీటీడీ ఆర్డర్‌తో ఉపాధి, వెంకన్నకు సేవ



(మొదటి పేజీ తరువాయి)

**తాడేపల్లి/అమరావతి,జూన్, 20,మనం న్యూస్ ప్రతినిధి) :** తిరుమల తిరుపతి దేవస్థానం ఆర్డర్ తో ఉపాధితో పాటు కలియుగ దైవం వెంకన్నకు సేవ చేసే అవకాశం నేతన్నలకు కలిగిందని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఆప్కో చరిత్రలో గతంలో ఎన్నడూ టీటీడీ ఆర్డర్ రాలేదని, ఇది కూటమి ప్రభుత్వ విజయమని తెలిపారు. క్వాలిటీతో కూడిన చేనేత వస్త్రాలను టీటీడీకి సరఫరా చేయాలని, 45 రోజుల్లోనే చెల్లింపులు చేస్తామని మంత్రి సవిత తెలిపారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో చేనేత సహకార సంఘాల ప్రతినిధులతో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆప్కో చరిత్రలోనే మొట్టమొదటిసారిగా తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి ఆర్డర్ వచ్చిందన్నారు. గతంలో తమిళనాడుకు చెందిన కో ఆప్టెక్స్ మాత్రమే టీటీడీకి చేనేత వస్త్రాలను సరఫరా చేసేదన్నారు. కూటమి ప్రభుత్వం జోక్యంతో ఆప్కోకు టీటీడీ ఆర్డర్ ఇచ్చిందన్నారు. ఎనిమిది రకాలైన చేనేత, సిల్క్ వస్త్రాలను సరఫరా చేయాలని టీటీడీ నుంచి ఆర్డర్ వచ్చిందన్నారు. మగ్గం మీద నేసే ఉత్తరీయం వస్త్రాలు, 5.50 మీటర్ల పట్టు చీరలు, 6 గజాల పట్టు చీరలతో పాటు పవర్ లూమ్ మీద నేసే సిల్క్, పాలిస్టర్ దుశ్శాలువాలు, కాటన్ బ్లౌజ్ లు తదితర వస్త్రాలను టీటీడీకి సరఫరా చేయాల్సి ఉంటుందన్నారు. క్వాలిటీతో కూడిన వస్త్రాలకు మాత్రమే టీటీడీ అనుమతిస్తుందన్నారు. ఈ ఎనిమిది రకాల వస్త్రాలను పంపిణీ చేసిన 45 రోజుల తరవాత ఆప్కో ద్వారా చెల్లింపులు చేస్తామన్నారు. ఆసక్తి కలిగిన చేనేత సంఘాల ప్రతినిదులు ముందుకు రావాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు. టీటీడీ ఆర్డరే కాకుండా ఇతర సంక్షేమ శాఖల నుంచి కూడా త్వరలో ఆర్డర్లు రానున్నాయన్నారు. నేతన్నలకు 365 రోజులూ ఉపాధి కల్పించాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. టీటీడీ వస్త్రాల సరఫరాతో నేతన్నలకు ఉపాధితో పాటు వెంకన్నకు సేవ చేసే అవకాశం కలిగిందని మంత్రి సవిత అభిప్రాయపడ్డారు. చేనేత, జౌళి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా మాట్లాడుతూ, టీటీడీకి నాణ్యత కలిగిన వస్త్రాలను సరఫరా చేయాలని, లేకుంటే తిరస్కరిస్తారని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ముందుకొస్తే, టీటీడీ ఆర్డర్ ప్రకారం వస్త్రాల సరఫరాకు అవకాశమిస్తామన్నారు. ఏయే వస్త్రానికి ఎంతమేర టీటీడీ ధర చెల్లించనుందో కమిషనర్ రేఖారాణి వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలో వివిధ జిల్లాలకు చెందిన చేనేత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## అన్నదాతకు అండగా 'అన్నదాత సుఖీభవ'

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రైతు కుటుంబానికి సంవత్సరానికి రూ.20 వేల ఆర్థిక సాయం అందించే ఈ పథకం వ్యవసాయ రంగానికి బలమైన అండగా నిలుస్తోందని తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, చిలకలూరిపేట నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ప్రస్తుత పరిణామాలతో పాటు గత పరిస్థితులను కూడా గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 2014లో ప్రజల అభిప్రాయానికి విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ను రెండు రాష్ట్రాలుగా విభజించారని, ఆ సమయంలో కొత్త రాష్ట్రానికి రాజధాని లేకపోవడం, కార్యాలయాలు లేకపోవడం, ఉద్యోగులు పనిచేసే పరిస్థితులు లేకపోవడం, రూ.16 వేల కోట్ల అప్పుతో రాష్ట్రం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొన్నదని గుర్తు చేశారు.అలాంటి క్లిష్ట సమయంలో రాష్ట్రాన్ని ముందుకు నడిపించగల నాయకుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాత్రమేనని ప్రజలు విశ్వసించి బాధ్యతలు అప్పగించారని చెప్పారు.

ఆయన సమర్థవంతమైన నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. 2019లో కూడా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా కొనసాగి ఉంటే రాష్ట్రం దేశంలో అగ్రగామిగా నిలిచేదని అభిప్రాయపడ్డారు.

# సైబర్ నేరాలపై సాంకేతిక యుద్ధం

- యువ పోలీసులకు ప్రత్యేక శిక్షణ
- థ్రెట్ ఇంటలిజెన్స్‌తో నేరగాళ్లకు చెక్
- తగ్గుతున్న ఆన్‌లైన్ మోసాలు



**హైదరాబాద్,జూన్ 20(మనం,ప్రత్యేక ప్రతినిధి) :** రాష్ట్రంలో సైబర్ నేరాల కట్టడికి సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ సెక్యూరిటీ బ్యూరోచెక్ పెడుతోంది. దీంతో గడచిన ఆరు నెలల కాలంలో తెలంగాణ రాష్ట్రంలో సైబర్ నేరాలు 11 శాతం తగ్గుముఖం పట్టినట్లు రికార్డులు వెల్లడిస్తున్నాయి. ఒకవైపు సైబర్ నేరాలను నియంత్రిస్తూ మరోవైపు సైబర్ బాధితుల సొత్తును రికవరీపై వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ వివరించారు. సైబర్ నేరాలలో సొమ్ము పోగొట్టుకున్న బాధితులు సకాలంలో (గంట వ్యవధిలో) ఫిర్యాదు చేస్తే వారు పోగొట్టుకున్న డబ్బు తిరిగి రాబట్టేందుకు అధికారులు చర్యలు వేగవంతం చేస్తున్నామని వివరించారు.

**అవగాహనతో చైతన్యం :**

రాష్ట్రంలో ఎప్పటికప్పుడు కొత్త పుంతలు తొక్కుతున్న సైబర్ నేరాలపై సామాన్య ప్రజలకు అవగాహన కల్పించేందుకు సైబర్ సెక్యూరిటీ బ్యూరో ప్రత్యేక వర్క్‌షాప్‌లను నిర్వహిస్తోందని సంబంధిత అధికారులు వివరిస్తున్నారు. తరచూ షీల్ వంటి కాంక్లేవ్ ద్వారా సైబర్ నేరాల పట్ల ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగించినట్లు అధికారులు చెబుతున్నారు. కాలర్ ట్యూన్స్, పోస్టర్లు, పాఠశాలలు, కళా శాలల్లో సైబర్ నేరాల కట్టడిపై వర్క్ షాప్‌లను నిర్వహిస్తున్నామని తెలిపారు.

## హర్మూజ్‌ను మళ్లీ మూసివేస్తున్నాం

### ఇరాన్ సైనిక విభాగం ప్రకటన

**టెహ్రాన్, జూన్ 20:** అమెరికా- ఇరాన్ మధ్య శాంతి ఒప్పందంతో పశ్చిమాసియాలో పరిస్థితులు కుదుటపడుతున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. హర్మూజ్ జలసంధిని మళ్లీ మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ నిరంతరం భీకర దాడులు చేస్తుండటాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిన కారణంగా తాజాగా హర్మూజ్ మూసివేత నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు ఇరాన్ సంయుక్త సైనిక విభాగ కేంద్రమైన ఖతమ్-అల్ అన్బియా ప్రకటించినట్లు అక్కడి అధికారిక మీడియా పేర్కొంది.

# విదేశాల్లోనూ 'లేపాక్షి' ఏర్పాటు

(మొదటి పేజీ తరువాయి)

**(అమరావతి,పి.మీరాహుస్సేన్, మనం న్యూస్ ప్రత్యేక ప్రతినిధి) :** రాష్ట్ర వ్యాప్తంగా నేతన్నలు, హస్త కళాకారులు గౌరవప్రదమైన జీవనం సాగించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, త్వరలో నేతన్న భరోసా పథకానికి శ్రీకారం చట్టనున్నామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత వెల్లడించారు. విదేశాల్లో కూడా లేపాక్షి షోరూమ్ లు ఏర్పాటు చేయనున్నామన్నారు. అమరావతిలోని శాఖమూరులో పది ఎకరాల విస్తీర్ణంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ(నిఫ్ట్) ఏర్పాటుకు నిర్ణయించామన్నారు. ఖాదీ, గ్రామీణ పరిశ్రమల మండలి ద్వారా యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్ల ప్రగతిపై శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. ఆనాడు అన్న ఎన్టీఆర్ కూడు, గూడు, గుడ్డ నినాదంతో, చేనేత వస్త్రాలకు ప్రాచుర్యం కల్పించారన్నారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబు నేతన్నల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్నారు. చేనేత రంగానికి పూర్వవైభవం తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే టెక్స్ టైల్స్ అప్పారెల్ గార్మెంట్స్ పాలసీ 2024-29 పాలసీ తీసుకొచ్చామన్నారు. ఈ పాలసీలో భాగంగా రాష్ట్రంలో టెక్స్ టైల్స్ రంగంలో రూ.10 వేలకోట్ల పెట్టుబడులు ఆకర్షణతో పాటు 2 లక్షల మందికి పైగా ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. గతేడాది విశాఖలో జరిగిన సీఐఐ సమ్మిట్ టెక్స్ టైల్స్ రంగంలో అయిదు ఒప్పందాలు జరిగాయని, రూ.4,700 కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. వాటిలో కొన్ని పరిశ్రమలకు భూములు, ఇతర మౌలిక సదుపాయలను కేటాయించామన్నారు. 50 ఏళ్లు నిండిన నేతన్నలకు పెన్షన్లు అందజేస్తున్నామని, బడ్జెట్ లో త్రిఫ్ట్ ఫండ్ నిధులు కేటాయించామని తెలిపారు. 2024-25లో 90 సంఘాలకు రూ.71.21 కోట్ల విలువైన నూలు సరఫరా చేశామన్నారు. 2025-26లో 109 సంఘాలకు రూ.175.20 కోట్ల విలువైన నూలు సరఫరా చేశామన్నారు. రెండేళ్లలో కలిపి రూ.246.41 కోట్ల విలువైన నూలు అందించి ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించామన్నారు. గత సంవత్సరం వన్ డిస్ట్రిక్ట్-వన్ ప్రొడెక్ట్ కింద ఏపీకి 10 అవార్డులు వస్తే, వాటిలో నాలుగు చేనేత రంగానికే వచ్చాయన్నారు.

### నేతన్నకుటుంబాల్లో 'ఉచిత' వెలుగులు

నేతన్నలకు ఉచిత విద్యుత్ సరఫరా హామీని నెరవేర్చామని మంత్రి సవిత తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 50,565 చేనేత కుటుంబాలకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేస్తున్నామన్నారు. మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్లు అందిస్తున్నామన్నారు. మగ్గం నేతన్నలకు నెలకు రూ.720లు, ఏడాదికి రూ. 8,640లు, మరమగ్గం నేతలన్నలకు నెల రూ.1,860లు, ఏడాదికి రూ.21,600లు లబ్ధి కలుగుతోందన్నారు. ఉచిత విద్యుత్ పథకం కోసం రూ.150 కోట్లు వెచ్చిస్తున్నామని, ఈ పథకం అమలుతో నేతన్నల కుటుంబాల్లో వెలుగులు నిండాయని మంత్రి సవిత తెలిపారు. చేనేత కార్మికులకు ఆర్థిక పరిపుష్టి లక్ష్యంగా పథకాలు అమలు చేస్తున్నామన్నారు. చేనేత కార్మికులకు రంగులు వేయడం, బ్లీచింగ్ ఛార్జీలు వేతనాలు పెంచామన్నారు. 90 శాతం సబ్సిడీతో మగ్గం పనిముట్లు అందజేస్తున్నామన్నారు. చేనేత కార్మికుల గుర్తింపు కార్డులు ఇస్తున్నామని, వస్త్రాలకు క్యూఆర్ కోడింగ్ ఇచ్చి... నేతన్నల కష్టం, వస్త్రం తయారీ గురించి తెలిపేలా ఆ కోడ్ లో పేర్కొంటున్నామని తెలిపారు. ఈ కోడింగ్ తో నకిలీ వస్త్రాల అమ్మకాలకు అడ్డుకట్టపడుతోందన్నారు.

### రాష్ట్రంలో క్లస్టర్లు, మెగా క్లస్టర్ల ఏర్పాటు

నేతన్నలకు ఉపాధి కల్పనే లక్ష్యంగా క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. రూ.10.44 కోట్లతో 10 చిన్న క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నామని, ధర్మవరంలో రూ.38.31 కోట్లతో మెగా చేనేత క్లస్టర్ నిర్మిస్తున్నామని తెలిపారు. మరావతిలో చేనేత, హస్తకళల మ్యూజియం నిర్మించబోతున్నామని వెల్లడించారు. పిఠాపురంలోని ఉప్పాడలో రూ.15.01 కోట్లు, మంగళగిరిలో హ్యాండ్లూమ్ ప్రాజెక్టుకు రూ.22.50 కోట్లతో చేనేత పార్క్ లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అమరావతిలోని శాఖమూరులో పది ఎకరాల విస్తీర్ణంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ(నిఫ్ట్) ఏర్పాటుకు నిర్ణయించామన్నారు. 7 వేల మంది చేనేతలకు రూ.65.35 కోట్లు ముద్ర రుణాలు మంజూరు. నేత వస్త్రాల అమ్మకాలు పెంచేలా ఆద్యం, టాటా తనేరియా, కో ఆప్టెక్స్ వంటి సంస్థలతో పాటు తిరుమల తిరుపతి దేవస్థానంతో కూడా ఒప్పందం చేసుకున్నామని తెలిపారు.

# నౌకాదళం.. మరింత బలోపేతం

**కోల్‌కతా/,ఢిల్లీ, జూన్ 20:** భారత నౌకాదళం మరింత బలోపేతం కానుంది. శత్రువుల రహస్య ఎత్తుగడలను చిత్తు చేసేలా దేశీయ అత్యాధునిక పరిజ్ఞానంతో తయారు చేసిన సరికొత్త నౌకలను రక్షణ రంగంలోకి దించనుంది. ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈ నెల 21న మూడు నౌకలను కోల్‌కతాలో జాతికి అంకితం చేసే కార్యక్రమానికి తూర్పు నౌకాదళ యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది.

**ఐఎన్ఎస్ అగ్రయ్...**

కోల్కతాలోని గార్డెన్‌రీచ్ షిప్‌బిల్డింగ్ ఇంజినీర్స్ (జీఆర్ఎస్ఈ)లో ఐఎన్ఎస్ అగ్రయ్ నౌకను యాంటీ సబ్మెరైన్ షాలో వాటర్ క్రాఫ్ట్గా నిర్మించారు. ఇది 77.6 మీటర్ల పొడవుంటుంది. 2024 మార్చి 13న జలప్రవేశం చేయించారు. తీర జలాల్లో ఆపరేషనల్ విధులకు అనువుగా ఈ యుద్ధనౌకను డిజైన్ చేశారు. ఉపరితల నిఘా, అన్వేషణ, శత్రువులపై దాడికి స్వీయ ఎయిర్‌క్రాఫ్ట్‌తో సమన్వయం చేసుకునేలా 88 శాతం ఆధునిక స్వీయ సాంకేతిక పరిజ్ఞానం వినియోగించారు. 30ఎంఎం నేవల్ సర్ఫేస్ గన్, వాటర్ జెట్లతో డీజిల్ యంత్రాలను అనుసంధానం చేయడం ప్రత్యేకత.

**ఐఎన్ఎస్ సంశోధక్...**

భారత నౌకాదళానికి సముద్ర భౌగోళిక, (హైడ్రోగ్రాఫిక్ సర్వే) సరిహద్దు జలాలు, సమగ్ర కొలతలు, కచ్చితత్వ పరిమాణం వంటి అంశాలపై వర్ణపటాల రూపకల్పన, నివేదికచార్టుల తయారీలో సామర్థ్యం పెంచేందుకు దోహదపడేలా ఐఎన్ఎస్ సంశోధక్ నౌకను నిర్మించారు. ఇది 110 మీటర్ల పొడవుతో ఉంటుంది.

## ం ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత

(మొదటి పేజీ తరువాయి)

వారి ఆరోగ్య చరిత్రను తెలుసుకునేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. దీర్ఘకాలిక వ్యాధులకు గురైనవారికి ఈ ఆరోగ్య పరీక్షల వివరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఏటా 60 లక్షల మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారని, 10 సంవత్సరాలలో రాష్ట్రంలోని ప్రతీ ఒక్కరికి ఆరోగ్య వివరాలు ఆన్లైన్ లో పొందుపరచి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ కు రాష్ట్రప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, పారిశుద్ధ్యాన్ని ప్రతీ పౌరుడు బాధ్యతగా తీసుకుని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలన్నారు. మన పరిసరాలు పరిశుభ్రంగా ఉండే అందరం ఆరోగ్యంగా ఉంటామన్నారు. గత ప్రభుత్వం ప్రజల ఆరోగ్య పరిరక్షణను గాలికి వదిలేసిందని, పారిశుద్ధ్య కార్యక్రమాలు సక్రమంగా అమలు చేయని కారణంగా చెత్త పేరుకొనిపోయి ప్రజల ఆరోగ్యం క్షీణించి అనారోగ్యానికి గురై ఆర్థికంగా ఇబ్బంది పడ్డారని అన్నారు. ఆరోగ్య పరిరక్షణపట్ల బాధ్యత కలిగిన ముఖ్యమంత్రి ఆ చెత్తనుండి విద్యుత్ ను ఉత్పత్తికి చర్యలు తీసుకున్నారని, అదేవిధంగా తడిచెత్త నుండి సేంద్రియ ఎరువులను తయారీకి చర్యలు తీసుకున్నారన్నారు. ప్లాస్టిక్ రీ సైక్లింగ్ ద్వారా రోడ్ల నిర్మాణానికి వినియోగించే వినూత్న ఆలోచనను ప్రభుత్వం చేస్తున్నదన్నారు. అంతేకాక చెత్త సంపద వాహనాల ద్వారా ప్లాస్టిక్ అందించిన వారికి వారి ఇంటికి అవసరమయ్యే టూత్ పేస్ట్, సబ్బులు వంటి నిత్యం వినియోగించే వస్తువులను అందిస్తున్నారన్నారు. ఆగిరిపల్లి మండలాన్ని సంపూర్ణ పారిశుద్ధ్యముగా తీర్చిదిద్ది రాష్ట్రానికే ఆదర్శంగా నిలపాలని మంత్రి పార్థసారథి అధికారులను ఆదేశించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించి భావితరాలకు మంచి పర్యావరణాన్ని అందించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. పర్యావరణానికి పెనుముప్పుగా పరిణమిస్తున్న ప్లాస్టిక్ వినియోగాన్ని నిర్మూలించడమే మార్గమన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా మానివేసి, గుడ్డ సంచులను వినియోగించాలని మంత్రి పిలుపునిచ్చారు. గ్రామీణాభివృద్ధికి వివిధ శాఖల అధికారులు.నాయకులు సమన్వయంతో పనిచేసి గ్రామ పరిధిలోని రోడ్లు, డ్రైనేజ్, విద్యుత్, త్రాగునీరు వంటి సమస్యలను తెలుసుకుని ఉన్నత అధికారులు, దృష్టికి తీసుకురావాలని మంత్రి చెప్పారు. నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమం ప్రతీ 3నెల వ శనివారం నిర్వహించి పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుతం ప్లాస్టిక్ నిర్మూలన నినాదంతో స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞను ప్రజలతో మంత్రి చేయించారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ శాఖ ప్రజలకు అందిస్తున్న సేవలను అధికారులు పారదర్శకంగా అందించాలి

- కలెక్టర్ వెంకటేశ్వర్

**తిరుపతి, జూన్ 20 మనం న్యూస్:** రెవెన్యూ శాఖ ప్రజలకు అందిస్తున్న సేవలను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా అందించడంలో అధికారులు నిబద్ధతతో పనిచేయాలని, టెక్నాలజీని అందిపుచ్చుకోవాలనీ జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్ లోని సమావేశ మందిరము నందు నిర్వహించిన రెవెన్యూ డే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రెవిన్యూ దినోత్సవ వేడుకలో జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు, డిఆర్ఓ నరసింహులు, డిప్యూటీ కలెక్టర్లు రోస్మండ్, శివశంకర్ నాయక్, రెవిన్యూ అసోసియేషన్ జిల్లాప్రెసిడెంట్ అయినా ఎస్. శివ ప్రసాద్ తో కలిసి పాల్గొని జ్యోతి ప్రజల్వన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అన్ని శాఖల కంటే రెవెన్యూ శాఖ చాలా కీలకమైనదని అన్నారు. రెవెన్యూ శాఖ అధికారులకు,సిబ్బందికి రెవెన్యూ దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. అన్ని రకాల సేవలతో పాటు రెవెన్యూకు సంబంధించిన



సేవలను బరువుగా కాకుండా బాధ్యతగా తీసుకొని సేవలు అందించాలన్నారు. రెవెన్యూకు సంబంధించిన నిర్ణయాలను తీసుకునేటప్పుడు ఖచ్చితంగా ఉండాలన్నారు. రెవిన్యూ శాఖలో పనిచేసే సిబ్బంది అధికారులు అందరూ సాంకేతికను అలవరచుకోవడంతో పాటు నైపుణ్యాలను కూడా అభివృద్ధి చేసుకోవాలని అన్నారు. అప్పుడే ప్రజలకు సులభతరంగా రెవెన్యూ సేవలను అందించవచ్చు అన్నారు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సేవలను అందించడం ప్రతి రెవెన్యూ అధికారి బాధ్యత అని తెలిపారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ, ఆక్రమణల నివారణ, రికార్డుల నవీకరణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామ, మండల స్థాయిలో ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించి ప్రభుత్వంపై ప్రజలకు మరింత విశ్వాసం కలిగేలా పని చేయాలని పేర్కొన్నారు. రోజువారి రెవెన్యూ కార్యక్రమాలతో బిజీగా ఉంటారని విధులతోపాటు ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలని తెలిపారు. సిబ్బందికి అప్పగించిన పనులను సమయాన్ని సర్దుబాటు చేసుకొంటూ అంకితభావం తో సేవలను అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అసోసియేషన్ వారు తయారుచేసిన ఐడి కార్డులను కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ శాఖలో పనిచేసే అధికారులు మరి సిబ్బందికి జిల్లా కలెక్టర్ వారికి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖలో పనిచేసిన విశ్రాంత ఉద్యోగులను జిల్లా కలెక్టర్ ఘనంగా సన్మానించారు.రెవిన్యూ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ మాట్లాడుతూ.. రెవున్యూ శాఖ ప్రాముఖ్యత గురించి తెలియజేసి ప్రభుత్వ ప్రాధాన్యత అనుగుణంగా ప్రజలతో స్నేహభావాతో రెవెన్యూ సమస్యలని సమర్థన్తవంతగా పని చేయాలనీ! ప్రజల విశ్వాసమే రెవిన్యూ శాఖ కు నిజమైన గుర్తింపు అని అన్నారు ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ అధికారులు, తహసీల్దార్లు, రెవెన్యూ అసోసియేషన్ ప్రెసిడెంట్ శివప్రసాద్, సెక్రెటరీ అశోక్ రెడ్డి, మండల స్థాయి అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# 24న మావుళ్ళమ్మ సన్నిధిలో సుదర్శన హోమం

**భీమవరం, జూన్ 20 (మనం న్యూస్) :** భీమవరం పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజల ఇలవేలుపు, ఆరాధ్యదైవంగా నిరాజిల్లుతున్న శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి దేవస్థానంలో లోక కళ్యాణార్థం, దుష్టశక్తుల నివారణ, ఆరోగ్యం, ఐశ్వర్యం, శాంతి, విజయాలు, కుటుంబ సౌఖ్యం మరియు గ్రహదోష నివారణ కొరకు ఈనెల 24 వ తేదీ బుధవారం ఉదయం 8 గంటల నుండి సుదర్శనహోమ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించడం జరుగుతుందని దేవస్థానం అసిస్టెంట్ కమీషనర్ బుద్ధమహాలక్ష్మి నగేష్, చైర్మన్ బొండాడ నాగభూషణం, ధర్మకర్తలు తెలిపారు. శ్రీ మహావిష్ణువు యొక్క దివ్య ఆయుధమైన సుదర్శనచక్రం అనుగ్రహంతో జీవితంలోని అడ్డంకులు తొలగి శుభఫలితాలు కలుగుతాయని శాస్త్రోక్త విశ్వాసమని దేవస్థానం ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ మద్దిరాల మల్లిఖార్జున శర్మ తెలిపారు. సుదర్శనుని అనుగ్రహం, జీవితానికి రక్షణ సమాజ శ్రేయస్సు, లోకహితం కొరకు పూర్తిగా ఉచితంగా చేస్తున్న ఈ సుదర్శన హోమంలో పాల్గొని శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి ఆశీస్సులు పొంది తీర్థప్రసాదాలు స్వీకరించి సుదర్శన కటాక్షంతో



సర్వరోగ నివారణం, సర్వ శత్రు వినాశనం, సర్వమంగళ ప్రదానం పొందవచ్చని తెలిపారు. అందరూ ఈ సుదర్శన హోమంలో పాల్గొని సర్వ కష్టాలు పోగొట్టుకొని సిరిసంపదలు సుఖ సంతోషాలతో ఆనందం ఉండాలని కోరారు.

# నేడు శ్రీ దనకొండాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవం




**పాలకొల్లు, జూన్ 20,మనం ప్రతినిధి :** పశ్చిమ గోదావరి జిల్లా ఎలమంచిలి మండలం మేడపాడు సమీపంలోని వరి పొలాలలో వేంచేసియున్న శ్రీ ధనకొండలమ్మ అమ్మవారి జాతర మహోత్సవం ఈనెల 21వ తేదీ ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు జరుగుతుంది. మేడపాడు, అడవి పాలెం, కొంతేరు, గగ్గిపర్రు గ్రామాల ప్రజలు గ్రామాలలో కోర్కెలు తీర్చే ఇలవేలుపుగా కొలుస్తున్నారు. సందర్భంగా ఉదయం 11 గంటల నుంచి అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు జాతర నిర్వాహకులు తెలిపారు. అమ్మవారి అన్న ప్రసాదం స్వీకరించేందుకు పై గ్రామాల ప్రజలందరూ రావాలని జాతర సంఘ ప్రతినిధులు కోరారు.

# రైతుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కృషి

- ఎమ్మెల్యే అంజిబాబు

**భీమవరం, జూన్ 20 (మనం న్యూస్):** రైతుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో కృషి చేస్తున్నాయని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం మండలం కొమరాడ గ్రామంలో శనివారం అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్ పథకం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అంజిబాబు పాల్గొని మాట్లాడుతూ జిల్లాలో 1,03,761 మంది రైతుల ఖాతాలలో మొదట విడతగా రూ 68.77 కోట్లు జమ చేస్తున్నారన్నారు. ఒక్కో రైతు ఖాతాలో కేంద్రం వాటా రూ 2 వేలు, రాష్ట్ర వాటా రూ 5 వేలు చొప్పున మొత్తం రూ7 వేలు జమ చేయడం జరుగుతుందన్నారు. టీడీపీ నియోజక వర్గ ఇన్ ఛార్జ్, రాజ్యసభ మాజీ సభ్యురాలు తోట



సీతారామలక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ భీమవరం నియోజక వర్గంలో 8,335 మంది రైతులకు రూ 5.66 కోట్లు జమ కానున్నాయని కూటమి ప్రభుత్వం రైతుల శ్రేయస్సు కోరే ప్రభుత్వమని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఖాతాలో అన్నదాత సుఖీభవ నిధులను ప్రభుత్వం అందిస్తుందని ఇది రైతులకు మరో అతి పెద్ద పండుగని అన్నారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్, వైస్ చైర్మన్, కార్పొరేషన్ చైర్మనులు, బ్యాంక్ చైర్మన్లు, డైరెక్టర్లు, కూటమి నాయకులు, కార్యకర్తలు అభిమానులు వీర మహిళలు తెలుగు మహిళలు పాల్గొన్నారు.

# పోలీసుల 'పల్లెనిద్ర'



**చిత్తూరు జూన్ 20 మనం న్యూస్:** చిత్తూరు జిల్లాలో సమాజంలో జరుగుతున్న వివిధ అంశాలపై చిత్తూరు జిల్లా పోలీసులు గ్రామాలకు వెళ్లి అవగాహన కల్పించడంలో భాగంగా పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు, జిల్లా అంతటా పోలీసులు గ్రామాల నందు పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.గ్రామీణ ప్రాంత ప్రజల భద్రత, అవగాహన, పోలీసు-ప్రజల మధ్య స్నేహపూర్వక సంబంధాలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని పోలీసులు తెలిపారు.పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా పోలీసులు ప్రజలకు ధైర్య-స్పర్శ కార్యక్రమం గురించి వివరిస్తూ పోలీసులే కాకుండా మీ ప్రాంతంలో అలాంటి ప్రదేశాలు ఉన్నట్టు గుర్తించిన పోలీసులకు తెలియజేయవచ్చునని తెలిపారు. మహిళలు చిన్నపిల్లలపై జరుగుతున్న నేరాల నివారణ, బాధితులు ఎదుర్కొనే పరిస్థితులు, ఫిర్యాదు చేసే విధానం, అలాగే తక్షణ సహాయం పొందే మార్గాలపై వివరించారు. సైబర్ క్రైమ్స్ విషయంలో సోషల్ మీడియా, ఆన్లైన్ లావాదేవీలలో జాగ్రత్తలు, మోసాలకు గురికాకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక, కుటుంబ పరమైన నష్టాలను వివరిస్తూ యువత మత్తుకు దూరంగా ఉండాలని సూచించారు. బాల్య వివాహాల వల్ల కలిగే చట్టపరమైన, సామాజిక సమస్యలపై స్పష్టతనిస్తూ, చట్టబద్ధమైన వయస్సు అనంతరమే వివాహం జరగాలని ప్రజలకు తెలియజేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు హెల్మెట్, సీట్బెల్ట్ వినియోగం, వేగ నియంత్రణ, మద్యం సేవించి వాహనాలు నడపకూడదనే అంశాలపై ప్రత్యేకంగా చర్చించారు. అదేవిధంగా గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాల నియంత్రణ, ఆధారాల సేకరణలో కలిగే ప్రయోజనాలను వివరించారు. పోలీసు-ప్రజల మధ్య నమ్మకం, సహకారం పెంపొందించుకోవడం ద్వారా మాత్రమే నేరరహిత సమాజం సాధ్యమవుతుందని తెలియపరిచారు.ప్రజల భాగస్వామ్యం, పోలీసుల నిరంతర కృషి ద్వారా గ్రామాలను మరింత సురక్షితంగా, శాంతియుతంగా మార్చడమే పల్లెనిద్ర కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యమని పోలీసులు స్పష్టం చేశారు.

# బి.సి రిజర్వేషన్లకు సుప్రీం మార్గదర్శకాలే ప్రామాణికం డెడికేటెడ్ కమిషన్

- రాజీవ్ రంజన్ మిశ్రా

**చిత్తూరు, జూన్ 20 మనం న్యూస్:** స్థానిక సంస్థల్లో వెనుకబడిన తరగతుల (బిసి) రిజర్వేషన్లకు సంబంధించి సుప్రీంకోర్టు నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు డెడికేటెడ్ కమిషన్ రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర అధ్యాయం నిర్వహిస్తుందని, చైర్మన్ డెడికేటెడ్ కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రా తెలిపారు.శనివారంవారం స్థానిక కలెక్టరేట్ లోని పి జి ఆర్ ఎస్ సమావేశ మందిరం నందు బీసీ సంక్షేమ శాఖ వారి ఆధర్వంలో స్థానిక సంస్థలు వెనుకబడిన తరగతులు రిజర్వేషన్ల పై అధ్యయనం, స్వీకరణ సంబంధించి చైర్మన్ డెడికేటెడ్ కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రా బీసీల సంఘాల నాయకులు నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలోజిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, డిఆర్ఓ కె.మోహన్ కుమార్, జిల్లా జెడ్పి సీఈఓ రవి ప్రకాష్, చిత్తూరు మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్, డి.పి.ఓ సుధాకర్, బీసీ సంక్షేమ అధికారి రబ్బానీ భాష లతో తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ,స్థానిక



సంస్థల్లోవెనుకబడిన తరగతుల (బిసి) రిజర్వేషన్ లకు సంబంధించి సుప్రీంకోర్టు నిర్దేశించిన మార్గదర్శకాలు మేరకు డెడికేటెడ్ కమిషన్ రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర అధ్యయనం నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, డి ఆర్ ఓ కే మోహన్ కుమార్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల్లో బీసీల జనాభా, వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులు మరియు స్థానిక సంస్థల్లో వారికి దక్కుతున్న రాజకీయ ప్రాతినిధ్యంపై సమగ్ర సమాచారాన్ని సేకరిస్తోంది.స్థానిక సంస్థలలో బీసీలకు తగిన రిజర్వేషన్లు, విద్య, ఉద్యోగాల్లో అమలు చేస్తున్నట్లే స్థానిక ఎన్నికల్లోనూ రిజర్వేషన్లు పొడిగించాలని పలు కార్పొరేషన్లు, కుల సంఘాల నాయకులు కమిషన్కు వినుతలు అందజేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమిషన్ విధానాలు అనుసరిస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు4.30,000 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు ఇటీవల 2021సర్పంచ్ రిజర్వేషన్లు 181 మంది సర్పంచులు బిసి రిజర్వేషన్ ద్వారా ఎన్నిక కావడం జరిగిందని గణాంకాలు చెబుతున్నాయి. వివిధ పంచాయతీలలో2021 గ్రామపంచాయతీ ఎన్నికలలో వార్డు మెంబర్లగా సుమారు 2500 మంది గెలుపొందారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో పబ్లిక్ హియరింగ్ నిర్వహిస్తూ సమాచారంను చైర్మన్ డెడికేటెడ్ కమిషన్ సేకరిస్తుందన్నారు. జిల్లాల వారిగా అందిన వినతులు, సూచనలు, అభిప్రాయాలను సమగ్రంగా పరిశీలించి నివేదికను రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, బీసీ సంఘాల ప్రతినిధులు ప్రజలు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది



- రైతులు ఎదుర్కొనే సమస్యలపై ప్రభుత్వం నిరంతరం సమీక్ష నిర్వహిస్తోంది
- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

**చిత్తూరు, జూన్ 20 మనం న్యూస్:** రైతులకు పెట్టుబడి భారం తగ్గించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే లక్ష్యంతో అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం కింద 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన తొలి విడత ఆర్థిక సహాయాన్ని చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల గ్రామంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతుల ఖాతాల్లో నిధులను జమ చేయగా జిల్లా స్థాయి కార్యక్రమం చిత్తూరు లోని జడ్పీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, చూడ చైర్మన్ కటారి హేమలత ఆధ్వర్యంలో జరిగింది. జఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 46,85,838 రైతు కుటుంబాలకు రూ.3,125 కోట్ల మేర ఆర్థిక సాయం అందింది.చిత్తూరు జిల్లా కలెక్టర్ అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రైతులు పంట సాగు ప్రారంభం నుంచి మార్కెటింగ్ వరకు అనేక సవాళ్లను ఎదుర్కొంటారని, అలాంటి ప్రతి సమస్యపై ప్రభుత్వం నిరంతరం స్పందిస్తూ పరిష్కార చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ముఖ్య కార్యదర్శులు, మంత్రులు, ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు పాల్గొనే ప్రత్యేక బృందం రైతుల సమస్యలను ప్రతిరోజూ సమీక్షిస్తోందన్నారు. కోకో, పొగాకు, ఆక్వా, ఎరువులు, ఉద్యాన పంటలు వంటి వివిధ రంగాల్లో రైతులు ఎదుర్కొనే ఇబ్బందులపై వెంటనే చర్చించి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి భారీ స్థాయిలో సబ్సిడీలు, ప్రోత్సాహకాలు అందిస్తున్నాయని తెలిపారు

# జువైనల్, పోక్సో చట్టాలపై అవగాహన సదస్సు




**నరసాపురం, జూన్ 20 (మనం న్యూస్) :** విద్యార్థినీ విద్యార్థులు పోక్సో చట్టం 2012 , జువైనెల్ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని నరసాపురం బార్ అసోసియేషన్ సభ్యులు సూచించారు. పోక్సో, జువైనల్ అవగాహన కొరకు10 వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎ. వాసంతి ఆదేశాల మేరకు శనివారం స్థానిక రుసుంబాద లోని సుబ్బారాయుడు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు పివిఎస్ఎన్ రాజు అధ్యక్షతన నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో నరసాపురం బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ వి. సూర్యప్రకాశరావు ముఖ్యఅదితి గా పాల్గొని మాట్లాడారు. గురువులను, తల్లిదండ్రులను గౌరవించడం, దేశ నాయకుల జీవిత చరిత్రలను చదవడం, పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలని అన్నారు. ప్యానెల్ న్యాయవాదులు కె. చిట్టిపద్మజ, బి. ప్రగతి మాట్లాడుతూ విద్యార్థులు స్కూలుకు వెళ్లి వచ్చే సమయంలో తెలియని వ్యక్తులు ద్వారా ఏమైనా ఇబ్బంది కలిగితే వెంటనే ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు చెప్పాలని గుడ్ టచ్, బాడ్ టచ్ పై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. చిన్నతనంలో నేర ప్రవృత్తిని ప్రేరేపించే యు ట్యూబ్ చానళ్లను చూడకూడదని, బాల నేరస్థులను శిక్షించడానికి ప్రత్యేక జువెనైల్ చట్టం ప్రత్యేక కారాగారాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. న్యాయ సేవాధికార సంస్థ టోల్ ఫ్రీ నెం.15100 కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట భద్రత మధ్య నీట్ పరీక్ష నిర్వహించాలి

**తిరుపతి జూన్ 20 మనం న్యూస్:** నీట్ పున: పరీక్ష నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (చీఫ్ సెక్రటరీ) సాయి ప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీ లు, సంబంధిత అధికారులతో సమీక్షించగా.. తిరుపతి జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు, డి ఆర్ ఓ న ర సిం హు లు హా జ ర య్యా రు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. రేపు జూన్ 21 వ తేదీన జరుగు నీట్ పున: పరీక్షను అత్యంత పారదర్శకంగా, ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా నీట్ పరీక్షను నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద భద్రత, అభ్యర్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, రవాణా, వైద్య సేవలు, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పరీక్షా నిర్వహణలో భాగస్వామ్య శాఖలైన రెవెన్యూ, పోలీస్, విద్య, వైద్య ఆరోగ్య, విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు.ఎన్ టిఎ వారితో సమన్వయం చేసుకొని పరీక్ష




విజయవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు.జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ మాట్లాడుతూ.. జిల్లాలో నీట్ పున: పరీక్ష నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. జిల్లాలో 9 కేంద్రాల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సిఐఎస్ఎఫ్ తో వారితో సమన్వయం చేసుకొని పరీక్ష సజావుగా నిర్వహించేలా చూడాలన్నారు. నీట్ పున:పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టినట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కి జిల్లా కలెక్టర్ తెలియజేశారు. నీట్ పున: పరీక్ష మధ్యాహ్నం 2.00 గంటలకు నుండి సాయంత్రం 5.15 గంటలకు వరకు జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు ఉదయం 11: 00 గంటలకు రిపోర్టింగ్ సమయానికి హాజరు కావాలనీ, హాజరయ్యే అభ్యర్థులందరూ మధ్యాహ్నం 1:30 గంటలకు లోపు పరీక్ష కేంద్రాల కు చేరుకోవాలన్నారు. తదుపరి ఎవరికి అనుమతించడం ఉండదన్నారు. అభ్యర్థులు గమనించి సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలనీ తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో కలెక్టరేట్ ఏవో , ఎల్ డి ఎం గుంటూరు రవి కుమార్, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చైన్ స్నాచింగ్ కేసు, మోటార్ సైకిల్ చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

## రూ. 6 లక్షల విలువైన బంగారు గొలుసు, మోటార్ సైకిల్ స్వాధీనం



**చిత్తూరు జూన్ 20 మనం న్యూస్:** చిత్తూరు పట్టణములోని కట్టమంచి ప్రాంతానికి చెందిన ద్వారకానగర్ లో మే27వతేది ఒక మహిళ మెడలో చైన్ లాక్కొని ఒక దొంగ మోటార్ సైకిల్ పై పారిపోయిన ఘటన చోటుచేసుకుంది. చోరిపై చిత్తూరు 1 టౌన్ పోలీస్ స్టేషన్ నందు బాదితులు ఇచ్చన ఫిర్యాదు మేరకు క్రైమ్ నెం.63/2026 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంబించడం జరిగింది.దీనిపై జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు,చిత్తూరుడిఎస్పీజె.వెంకటనారాయణ మార్గదర్శకత్వంలో చిత్తూరు 1 టౌన్ పోలీస్ స్టేషన్ ఇంచార్జ్ ఇన్స్పెక్టర్ డి.నెట్టికంటయ్య సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టడం జరిగింది.ఈ దర్యాప్తులో బాగంగా రాబడిన సమాచారం మేరకు చిత్తూరు 1 టౌన్ ఎస్.ఐ ఎం. మారెప్ప సిబ్బందితో కలిసిశనివారం చిత్తూరు పట్టణంలోని గ్రీమ్స్పేట శ్మశానం సమీపంలోని ఫారెస్ట్ రోడ్డులో ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు.

ఈ సందర్భంగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా, అతను తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఎస్. రాజాదొరై (34) గా గుర్తించారు. విచారణలో అతను చిత్తూరు-1 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన క్రైమ్ నెం.63/2026లో బంగారు గొలుసు లాక్కొన్న కేసులో, అలాగే శ్రీకాళహస్తి-1 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన క్రైమ్ నెం.69/2026 మోటార్ సైకిల్ చోరీ కేసులో తన ప్రమేయాన్ని అంగీకరించినాడు.అదేవిధంగా, నిందితుడు తమిళనాడు రాష్ట్రంలోని పలు మోటార్ సైకిల్ చోరీ కేసుల్లో కూడా నిందితుడిగా ఉన్నట్లు విచారణలో వెల్లడైంది.నిందితుడి వద్ద నుండి సుమారు 39.800 గ్రాముల బంగారు గొలుసు మరియు ఒక హీరో మోటార్ సైకిల్ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఆస్తుల మొత్తం విలువ సుమారు రూ. 6 లక్షలుగా అంచనా వేయబడింది.

నిందితుడిని అరెస్టు చేసి, తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టి గౌరవ న్యాయస్థానం ముందు హాజరుపరచనున్నారు.

# కుళ్ళిన మాంసం విక్రయాలపై సమగ్ర విచారణ జరపాలి



**తిరుపతి జూన్ 20 మనం న్యూస్:** తిరుపతి నగరంలో వరుసగా వెలుగులోకి వస్తున్న కల్తీ ఆహారం, నాసిరకం మాంసం, చేపల విక్రయాల ఘటనలు ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయని పేర్కొంటూ సీపీఎం, సీపీఐ నాయకులు జిల్లా కలెక్టర్ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న కల్తీ ఆహార మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని, సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టి. సుబ్రహ్మణ్యం, సీపీఐ నగర కార్యదర్శి జె. విశ్వనాథం, సీపీఎం నగర కార్యదర్శి కె. వేణుగోపాల్ మాట్లాడుతూ గత పది రోజులుగా తిరుపతి నగరంలో వరుసగా బయటపడుతున్న ఘటనలు ఆహార భద్రతా వ్యవస్థ వైఫల్యాన్ని బట్టబయలు చేస్తున్నాయని అన్నారు. పి.పి. చావడిలో నెలల తరబడి నిల్వ ఉంచిన మేక తలలు, కాళ్లు, మేక మాంసం కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లడం, ఎస్వీ యూనివర్సిటీ మొదటి గేటు వద్ద కుళ్లిపోయిన ఆహార పదార్థాలను వండి విక్రయించడం, చేపల మార్కెట్లో కుళ్లిపోయిన చేపలు, పురుగులు పట్టిన చేపలను విక్రయించడం, తాజాగా కేఫ్సీలో నాసిరకమైన ఆహార పదార్థాలు, కుళ్లిన మాంసం బయటపడడం వంటి ఘటనలు ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయని పేర్కొన్నారు.ఆహార భద్రతా శాఖ, ఆరోగ్య శాఖ అధికారులు ఎక్కడ తనిఖీలు నిర్వహించినా గుట్టలుగా కుళ్లిపోయిన ఆహార పదార్థాలు బయటపడుతున్నాయని, ఇది విడివిడిగా జరిగిన ఘటనలు కాకుండా నగరవ్యాప్తంగా విస్తరించిన కల్తీ ఆహార మాఫియా కార్యకలాపాలకు నిదర్శనమని అన్నారు. తిరుపతికి ప్రతిరోజూ లక్షలాది మంది భక్తులు, పర్యాటకులు వస్తుంటారని, వారి ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

## తెలుగు భాషా వైభవము

నన్నయ మహాకవీంద్రుడు నాడు వ్రాసె
భారతమ్మును తెలుగులో భవ్యముగను
ఆ పిదప తిక్కనార్యుడు, ఆ తదుపరి
సుకవి ఎర్రన ముగియించి శోభ గూర్చె

తెలుగు భాషన్న చో మది పులకరించు.
మధుర మౌ పద్య తతులను మనసు మెచ్చు
తెలుగు భాషలో నెందరో వెలుగు లీన
పద్య కావ్యాలు వ్రాసిరి పరవశాన

'దేశ భాషలలో లెస్స తెలుగ'టంచు
కృష్ణ దేవ రాయలనె నుత్క ృష్టముగను
దివ్య మౌ తెల్గు వెల్గు దేదీప్యముగను
ప్రాభవమ్ముగ వ్యాప్తమై ప్రభలు గాక

తెలుగు భాషన్న చో వెల్గు జిలుగు మయము
తెలుగు పద్యాలు జూడగ తీపి యుతము
పద్య, గేయ కావ్యాలతో పదిలముగను
తెలుగు నిరతమ్ము నిల్చును వెలుగులీన

**- వడ్ల వీరాచారి**
8897182796

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు**
**manamlekhalu@gmail.com**
**మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.**

**ఈ పేపర్ కోసం**
**https://www.manamepaper.com/**
**వెబ్‌సైట్‌లో చూడండి**

**– ఎడిటర్**

# తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్



నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల్లో 'ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష'ను రగిలించిన చైతన్యస్ఫూర్తి ప్రొఫెసర్ జయశంకర్. ' నీళ్లు, నిధులు, నియామకాలు' అనే ఈ నినాదాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి తెలంగాణ స్వరాష్ట్ర చైతన్య జ్వాలలను రగిలించిన ధిక్కారస్వరం ఆయన. 'తెలంగాణ కేవలం రాజకీయ సమస్య కాదు. సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక సమస్య. అన్నింటికి మించి ఆత్మగౌరవ సమస్య' అని ఎలుగెత్తి నినదించిన పోరాటయోధుడు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన పోరాట క్రమంలో అడుగడుగునా ఎన్నో అడ్డంకులు ఎదురైననూ ఆయన వాటన్నింటిని ప్రతిఘటించి ముందుకు సాగిపోయారు తప్ప ఆయన ఏనాడు వెనకడుగు వేయలేదు. 'మా వనరులపై మాకు అధికారం కావాలి. మా తెలంగాణ మాగ్గావాలి' అని ప్రొఫెసర్ జయశంకర్ తన జీవితమంతా అవిశ్రాంతంగా ఉద్యమించారు.

'తెలంగాణ సిద్ధాంతకర్త'గా ప్రాచుర్యం పొందిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 1934 ఆగష్టు 6 నాడు మహాలక్ష్మి, లక్ష్మీకాంతరావు దంపతులకు రెండవ సంతానంగా జన్మించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ఆత్మకూరు మండలం లోని అక్కంపేట ఆయన స్వగ్రామం. ప్రొఫెసర్ జయశంకర్ బెనారస్ యూనివర్శిటీ నుంచి ఆర్థిక శాస్త్రంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పట్టా పొంది ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పూర్తి చేశారు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయాల పట్ల, అసమానతల పట్ల ప్రొఫెసర్ జయశంకర్ విద్యార్థి దశ నుండే తీవ్రంగా స్పందించి నినదించారు. ఆయన విద్యార్థి నాయకుడిగా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. ఇడ్లీ - సాంబర్ గో బ్యాక్' అంటూ ఆయన నినదించారు. నాన్ ముల్కీ ఉద్యమంలోనూ ఆయన ప్రముఖ పాత్ర పోషించారు. విశాలాంధ్ర ప్రతిపాదనను వ్యతిరేకించి మొదటి ఎస్సార్సీ కమిషన్ ముందు హాజరై 'ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం' ఆకాంక్షను ఆయన ఆనాడే నొక్కి చెప్పారు.

వరంగల్లో విప్లవ విద్యార్థి ఉద్యమానికి కేంద్రంగా ఉన్న వరంగల్‌లోని చంద్రాకాంతయ్య స్మారక కళాశాలకు (సి.కె.ఎం)




1975 నుంచి 1979 వరకు ప్రొఫెసర్ జయశంకర్ ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. ఆ ఎమర్జెన్సీ కాలంలో ఆయన అనేక మంది విద్యార్థుల్ని మరియు అధ్యాపకుల్ని నిర్బంధం నుండి కాపాడారు. ప్రొఫెసర్ జయశంకర్ 1979 నుండి 1981 వరకు కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ గాను, 1982 నుంచి 1991 వరకు సీఫెల్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ గాను, 1991 నుంచి 1994 వరకు సీఫెల్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ గాను బాధ్యతలు నిర్వహించారు.

1969 లో తెలంగాణ రాష్ట్ర తొలి దశ ఉద్యమానికి మరియు 1996 లో ప్రారంభమైన తెలంగాణ రాష్ట్ర మలి దశ ఉద్యమానికి ప్రొఫెసర్ జయశంకర్ నాయకత్వం వహించి ముందుండి నడిపారు. 1999లో తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరమ్‌ను ఏర్పాటు చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. తెలంగాణ సమస్యలపై పరిశోధన, ప్రచురణలో భాగమైన తెలంగాణ అధ్యయన కేంద్రానికి ఛైర్మన్‌గాను ఆయన పని చేశారు. అసంఘటిత రంగంలోని సంస్థల జాతీయ కమిషన్‌లో సభ్యుడిగాను 2004-2006 వరకు ఆయన కొనసాగారు. తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ ఏర్పాటులో కల్వకుంట్ల చంద్రశేఖరరావుకు ప్రొఫెసర్ జయశంకర్ మార్గదర్శకులుగా వ్యవహరించి తెలంగాణ రాష్ట్ర సాధనకు 'సరికొత్త ఊపిరి'ని అందించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతపై నియ మించబడ్డ అనేక కమిటీలకు గణాంకాలతో సహా పలు నివేదికలు ఆయన అందించారు.

తెలుగు, ఉర్దూ, హిందీ, ఇంగ్లీషు భాషల్లో విశేష ప్రావీణ్యం ఉన్న ప్రొఫెసర్ జయశంకర్ 'ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకత'ను నొక్కి చెప్తూ తెలంగాణ రాష్ట్రం ఒక డిమాండ్, వక్రీకరణలు-వాస్తవాలు, తల్లడిల్లుతున్న తెలంగాణ (వ్యాస సంపుటి) తదితర రచనలు చేశారు. ప్రపంచమంతా పరివ్యాప్తమయ్యేలా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకత గురించి ఆయన అనేక వ్యాసాలు రాశారు. అలాగే ఉపన్యాసాల ద్వారా కూడా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పలు జాతీయ, అంతర్జాతీయ వేదికల మీద గళం విప్పారు.

ప్రొఫెసర్ జయశంకర్‌ను అందరూ 'తెలంగాణ సిద్ధాంతకర్త'గా భావించేవారు. కాని 'నన్ను ఎప్పుడూ నేను సిద్ధాంతకర్తగాను భావించుకోలేదు. నేను తెలంగాణ సిద్ధాంతకర్తను కాను. నన్ను ఆ విధంగా సంభోదించకండి' అని ఆయన అనేక సందర్భాల్లో పేర్కొన్ననూ ఆయన జనం నోళ్లలో 'తెలంగాణ సిద్ధాంతకర్త'గా ప్రతిధ్వనిస్తూనే ఉన్నారు. 'ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కళ్లారా చూసిన తర్వాతే చనిపోవాలి' అని ప్రొఫెసర్ జయశంకర్ తన సన్నిహితుల వద్ద తరచుగా ప్రస్తావించేవారు. కాని ఆయన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం కాకముందే 2011 జూన్ 21 నాడు మరణించారు.

తన జీవితాన్ని యావత్ తెలంగాణ కోసం అంకితం చేసి ఆజన్మ బ్రహ్మచారిగా జీవించి ప్రత్యేక తెలం గాణ రాష్ట్రం ఆవిర్భావం కోసం తుదిశ్వాస విడిచేవరకు ఉద్య మించిన ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర చరిత్రలో మహో జ్వలంగా వెలుగొందుతూనే ఉన్నారు. అంతే కాకుండా అనేక ప్రజాస్వామిక ఉద్యమాలకు ఆయన ఒక 'దారిదీపం'లా ప్రభవిస్తున్నారు. అంతిమంగా ప్రగతిశీల తెలంగాణ ప్రజానీకం భౌగోళిక తెలంగాణాని బద్దలు కొట్టి 'ప్రజాస్వామిక తెలంగాణ'ని సాకారం చేసే దిశగా ఉద్యమించడమే ఆయనకు అందించే నిజమైన నివాళి కాగలదు.

(జూన్ 21 ప్రొఫెసర్ జయశంకర్ 15 వ వర్ధంతి)

**- జె.జె.సి.పి. బాబూరావు**
94933 19690

# భాషాశాస్త్ర దిక్సూచి...భద్రిరాజు



భద్రిరాజు కృష్ణమూర్తి - తెలుగు భాషాశాస్త్ర రంగంలో వెలుగొందిన ప్రఖ్యాత పండితుడు. ద్రావిడ భాషల తులనాత్మక అధ్యయనం, శబ్ద నిర్మాణ విశ్లేషణ, వ్యాకరణ రూప పరిణామం వంటి విభాగాలలో ఆయన సాధించిన శాస్త్రీయ పరిశోధనలు భారత భాషాశాస్త్ర పరిణామాన్ని విశ్వవేదికలపై ప్రతిష్ఠాపించాయి. భాషలను కేవలం వాడుకకే పరిమితం కాక, వాటి మూలాలకు, నిర్మాణాలకు అర్థం తెలిపేలా చేసిన పరిశోధనల్లో ఆయన పాత్ర అపూర్వమైనది.

ఆంధ్రప్రదేశ్ తూర్పుగోదావరి జిల్లాలోని వెలుగుబండ గ్రామంలో 1928 జూన్ 19న జన్మించిన భద్రిరాజు చిన్ననాటి నుంచే బుద్ధిమంతుడిగా గుర్తింపు నందుకున్నారు. పిఠాపురం వయోజన విద్యాసంస్థల ద్వారా ప్రాథమిక విద్యనభ్యసించిన ఆయన, అనంతరం బెనారస్ హిందూ విశ్వ విద్యాలయంలో సంస్కృతంలో ఎం.ఎ. పూర్తి చేశారు.

ఆ తర్వాత అమెరికాలోని కాలిఫోర్నియా విశ్వ విద్యాలయం, బర్కిలీ నుండి భాషా శాస్త్రంలో పి.హెచ్.డి. పొందారు. అక్కడ ఆయన చార్లెస్ హాకెట్, ముర్రే ఎమెన్యూ వంటి భాషా శాస్త్రవేత్తల శిక్షణలో శాస్త్రీయ దృక్పథాన్ని సంపాదించారు.

ఆయన విద్యా, పరిశోధనా ప్రస్థానం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు, ద్రావిడ భాషాశాస్త్ర విభాగానికి ప్రొఫెసర్‌గా కొనసాగింది. 1962 నుండి 1988 వరకు ఆయన ఆచార్య పదవిలో ఉన్నారు. ఈ కాలంలో తెలుగు భాషాశాస్త్ర అధ్యయ నానికి కొత్త వెలుగు చూపించి, పరిశోధనలకు మార్గనిర్దేశం చేశారు. భాషను శాస్త్రీయంగా అధ్యయనం చేయాలన్న దృక్పథాన్ని ఆయన విద్యార్థులకు నాటించారు. ఆయన శిష్యులలో ఎందరో నేటికీ వివిధ విశ్వవిద్యాలయాలలో ప్రఖ్యాతులుగా ఉన్నారు.

1961లో ప్రచురితమైన Telugu Verbal Bases అనే గ్రంథం ఆయనకు అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చిపెట్టింది. తెలుగు క్రియారూపాల తులనాత్మక అధ్యయనం, ద్రావిడ మూలాల అన్వేషణ ఈ గ్రంథంలో శాస్త్రీయంగా విశ్లేషించబడింది. తరువాత కాలంలో వచ్చిన "Comparative dravidian Linguistics: Current Pers pectives", "The dravidian Languages", "A Grammar of Modern Telugu" వంటి గ్రంథాలు ద్రావిడ భాషాశాస్త్ర విభాగంలో ప్రామాణిక గ్రంథాలుగా నిలిచాయి.

భద్రిరాజు కృష్ణమూర్తి పరిశోధనలు భాష శాస్త్రపు వివిధ విభాగాలకు వ్యాపించాయి - వ్యాకరణ శాస్త్రం, శబ్ద నిర్మాణం, భాషా పరిణామ క్రమం, మాండలిక అధ్యయనం, శాసనాల్లోని భాషా పరమైన అంశాల విశ్లేషణ మొదలైన అంశాలలో ఆయన సుదీర్ఘంగా కృషి చేశారు. భాషను కేవలం వ్యాకరణ పరిమితుల్లో కాక, సంస్క ృతి, చరిత్ర, సమాజంతో ముడిపెట్టి అధ్యయనం చేసిన ఆయన దృక్పథం ఎంతో విశాలమైనది.

కేంద్ర భాషా సంస్థ, మైసూరుకు తొలి డైరెక్టర్‌గా పనిచేసిన ఆయన, భారత భాషల అధ్యయనానికి సాంకేతిక, శాస్త్రీయ దిశల్ని సూచించారు. భారత ప్రభుత్వ భాషా కమిషన్, సాహిత్య అకాడమీ, యునెస్కో భాషా ప్రాజెక్టుల్లో సలహాదారుడిగా కీలకంగా పని చేశారు. అంతర్జాతీయ విశ్వ విద్యాలయాల్లో అతిథి అధ్యాపకుడిగా సేవలందించారు. ఆయనకు లభించిన పురస్కారాలు ఆయన గొప్పతనానికి నిదర్శనంగా నిలిచాయి.

కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం (1993), పద్మభూషణ్ (2000), భాషా గౌరవ పురస్కారాలతో పాటు అనేక విశ్వ విద్యాలయాల నుండి గౌరవ డాక్టరేట్లు పొందారు. 2012 ఫిబ్రవరి 1న భద్రిరాజు కృష్ణమూర్తి గారు మృతి చెందినా, ఆయన చేసిన కృషి శాశ్వతంగా భాషా ప్రపంచంలో నిలిచిపోతుంది. ఆయన జీవితం భాషాపరంగా పరిశోధన చేయాలనుకునే ప్రతిభావంతుల కోసం మార్గదర్శక దీపంలా నిలుస్తుంది. భద్రిరాజు కృష్ణమూర్తి గారి పేరే భారత భాషాశాస్త్ర వికాసానికి ప్రతీకగా నిలిచి ఉంది.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# ఘర్షణల నుంచి సంభాషణల దిశగా...



ప్రపంచ రాజకీయాల్లో కొన్ని పరిణామాలు కేవలం వార్తలుగా మాత్రమే మిగలవు; అవి అంతర్జాతీయ సంబంధాల భవిష్యత్తును నిర్దేశించే మలుపులుగా నిలుస్తాయి. ఇటీవల పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల మధ్య అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన కాల్పుల విరమణ ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య పెరిగిన ఉద్రిక్తతలు మరింత విస్తరించే ప్రమాదం ఉందన్న ఆందోళనల మధ్య వెలువడిన ఈ పరిణామం అంతర్జాతీయ సమాజానికి కొంత ఊరటనిచ్చింది. అయితే ఇది కేవలం ఒక రాజకీయ ప్రకటనగా కాకుండా, ఘర్షణల నుంచి సంభాషణల వైపు ప్రపంచం మళ్లవలసిన అవసరాన్ని గుర్తు చేసిన సందర్భంగా కూడా చూడాలి. పశ్చిమాసియా ప్రాంతం ప్రపంచ రాజకీయ, ఆర్థిక వ్యవస్థలకు అత్యంత కీలకమైన ప్రాంతం. ఇక్కడ ఏర్పడే ప్రతి ఉద్రిక్తత ప్రపంచ ఇంధన మార్కెట్లపై, వాణిజ్య మార్గాలపై, పెట్టుబడుల ప్రవాహంపై ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా హోర్ముజ్ జలసంధి వంటి వ్యూహాత్మక మార్గాల భద్రతకు సంబంధించిన ప్రశ్నలు తలెత్తినప్పుడల్లా ప్రపంచ దేశాలు అప్రమత్తమవుతాయి. అందువల్ల అక్కడి పరిస్థితులు కేవలం ప్రాంతీయ అంశాలుగా కాకుండా అంతర్జాతీయ స్థిరత్వంతో ముడిపడి ఉంటాయి.ఇటీవలి పరిణామాల్లో పరస్పర దాడులు, ప్రతిదాడులు, భద్రతా ఆందోళనలు, దౌత్యపరమైన ప్రకటనలు వరుసగా చోటుచేసుకున్నాయి. పరిస్థితి మరింత దిగజారితే ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి పెరిగే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అలాంటి సమయంలో కాల్పుల విరమణకు సంబంధించిన ప్రకటన రావడం ఉద్రిక్తతలను తగ్గించే దిశగా ఒక ముఖ్యమైన అడుగుగా భావించవచ్చు. అయితే శాంతి అనేది ఒక్క ప్రకటనతో సాధ్యమయ్యే విషయం కాదు. అది పరస్పర విశ్వాసం, నిరంతర సంభాషణలు, బాధ్యతాయుత దౌత్యం ద్వారా మాత్రమే బలపడుతుంది.చరిత్ర చెబుతున్న ఒక ముఖ్యమైన సత్యం ఏమిటంటే, యుద్ధాలు తాత్కాలిక విజయాలను ఇవ్వవచ్చు; కానీ స్థిరమైన పరిష్కారాలను ఇవ్వలేవు. చివరికి అన్ని పక్షాలు చర్చల బల్లవద్దకే రావాల్సి వస్తుంది. అందుకే ప్రపంచ నాయకత్వం ఘర్షణలను విస్తరించే ప్రయత్నాల కంటే, పరిష్కారాలను అన్వేషించే ప్రయత్నాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. శక్తి ప్రదర్శన కంటే సంయమనం, ప్రతీకారం కంటే పరస్పర అవగాహన, ఉద్రిక్తత కంటే స్థిరత్వం ప్రపంచానికి మరింత అవసరం.ప్రపంచం నేడు ఎదుర్కొంటున్న సవాళ్లు దేశాలు ఒంటరిగా పరిష్కరించగలిగేవి కావు. ఇంధన భద్రత, ఆర్థిక స్థిరత్వం, వాతావరణ మార్పులు, అంతర్జాతీయ వాణిజ్యం వంటి అంశాలు సమిష్టి సహకారాన్ని కోరుతున్నాయి. అందువల్ల ఏ ప్రాంతంలోనైనా శాంతి నెలకొనడం ప్రపంచ శ్రేయస్సుకు దోహదపడుతుంది. పశ్చిమాసియాలో తాజా పరిణామాలు కూడా ఇదే సందేశాన్ని ఇస్తున్నాయి.శాంతి అనేది బలహీనతకు గుర్తు కాదు. అది పరిపక్వతకు నిదర్శనం. ఘర్షణలతో సాధించలేనిదాన్ని సంభాషణలు సాధించగలవు. అందువల్ల ప్రపంచ దేశాలు విభేదాల కంటే సంభాషణలకు, అనుమానాల కంటే విశ్వాసానికి, ఘర్షణల కంటే సహకారానికి ప్రాధాన్యం ఇచ్చినప్పుడే స్థిరమైన శాంతి సాధ్యమవుతుంది. నేటి ప్రపంచానికి అత్యంత అవసరమైనది అదే.

**- చిటికెన కిరణ్ కుమార్**
9490841284

# శరీరాన్ని మనసును ఏకం చేయడమే యోగా

యోగా అనే పదం సంస్క ృతం నుంచి వచ్చింది. 'యుజ అనే పదం నుంచి వచ్చింది. యుజ అంటే దేన్నయినా ఏకం చేయడం.. లేదా చేరడం అని అర్థం. అంటే.. శరీరాన్ని, మనసును ఏకం చేయడమే యోగా ఉద్దేశం. జూన్ 21నే యోగాడేను జరు పుకోవడానికి పెద్ద కారణమే ఉంది. జూన్ 21.. ఉత్తరా ర్ధగోళంలో అత్యధిక పగటి సమయం ఉన్న రోజు. ప్రపంచం లోని పలు ప్రాంతాల్లో ఆ రోజుకు పగలు ఎక్కువగా ఉన్న రోజుగా ప్రత్యేకత కూడా ఉంటుంది. ఆ గుర్తింపు తోనే .. అదే రోజును 'అంతర్జాతీయ యోగా దినోత్సవం'గా జరుపు కోవాలని నిర్ణయించారు. యోగా ఇప్పటిదేమీ కాదు.. దాదాపు 5000 ఏళ్ల నాటి చరిత్ర ఉంది యోగాకు. యోగను శాస్త్రీయంగా క్రోడీకరించిన వారిలో ఆద్యుడు పతంజలి అష్టాంగ యోగా, అయ్యంగార్, విన్యాస యోగా కూడా ఈ క్రమంలో రూపు దిద్దుకున్నవే. 'అ ' పతంజలి మహర్షి సిద్ధం చేశారని చెబుతారు. ఉపనిషత్తులలోను, భగవద్గీతలోను యోగా ప్రస్తావన ఉంది. మొండి రోగాలను సైతం నయం చేయగల మహత్తర శక్తి యోగా ఉందని పరిశోధనల్లో తేలింది. యోగా చేయడం వల్ల శారీరకంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా ఎన్నో ప్రయోజనాలు ఉంటాయి. యోగా వల్ల కలిగే ఆ ప్రయోజనాల గురించి ప్రజలను చైతన్యం చేయడమే 'యోగా డే' ముఖ్య ఉద్దేశం. యుగయుగాలుగా మన సనాతన భారత సంప్రదాయంలో ఇమిడి ఉండి, పూర్వీకులెందరో తమ శారీరక, మానసిక ఉల్లాసానికి అనాదిగా ఆచరించిన సాధనం 'యోగ సాధన'. ప్రాచీన కాలం నుండి ఎందరో మునులు, యతులు, ఋషులు, యోగులు తమ తపోనిష్టకు అనారోగ్యం అడ్డు కాకుండా కనిపెట్టిన 'ఆసనాలు', ఆచరించిన శ్వాస సంబంధిత 'ప్రాణాయామాలు, క్రమంగా మనకు 'యోగా' పాఠాలుగా మారాయి అనడం అతిశయోక్తి కాదు ఆ కాలంలోనే 'పతంజలి' మహర్షి మన వేదాలు, ఉపనిషత్తుల ఆధారంగా స్వయంగా 'యోగ దర్శిని' అనే గ్రంథాన్ని రచించారు. ఈ తాళ పత్ర గ్రంథం ఆధారంగానే ప్రపంచ వ్యాప్తంగా, ఎందరో యోగా గురువులు తమ సాధనలను, అనుభవాలను రంగరించి వేలాది యోగా పుస్తకాలను రంచించారు. ఇంకా రచిస్తూనే ఉన్నారు. పతంజలి మహర్షి భావనలో యోగా అనేది 'అష్టాంగ యోగం'. అంటే ఈ యోగా అనే శాస్త్రాన్ని 'యమము, నియమము, ఆసనము, ప్రాణాయామము, ప్రత్యాహారము, ధారణ, ధ్యానం, సమాధి అనే ఎనిమిది భాగాలుగా విశ్లేషించి చెప్పారు పతంజలి మహర్షి. ఈ ప్రాచీన పద్ధతులను ఆచరిస్తూ విశ్వవ్యాప్తంగా ఎందరో యోగ సాధకులుగా, యోగా గురువులుగా కొనసాగుతున్నారు. యోగాకు సంబంధించిన యోగశాస్త్రాన్ని ప్రపంచానికి పరిచయం చేసింది భారతీయులే. భారతదేశంలో పురుడు పోసుకున్న యోగా నేడు ప్రపంచమంతా పాకింది. ఐదు సహస్రాబ్దాలకు పైగా భారతీయ జీవన విధానంలో అంతర్భాగమైన యోగవిద్యను యావత్ ప్రపంచం ఎప్పటి నుంచో అనుసరిస్తుంది. అందుకే.. యోగాను ప్రపంచ వ్యాప్తం చేయడం కోసం ప్రతి సంవత్సరం యోగాడేను నిర్వహిస్తారు. ప్రతి సంవత్సరం ఒక నినాదంతో యోగా డేను నిర్వహిస్తారు. 2500 ఏళ్ల క్రితం సాధువులు యోగా సాధనలు చేసేవారని యూనివర్సిటీ ఆఫ్ లండన్ కు చెందిన పరిశోధకుడు, సీనియర్ అధ్యాపకుడు డాక్టర్ జిమ్ మల్లిన్సన్ అభిప్రాయం. ఆయన యోగా చరిత్ర మీద అధ్యయనం చేస్తున్నారు. అప్పట్లో స్థిరంగా ఒక భంగిమలో ఉంటూ యోగా చేసేవారని, ప్రస్తుతం యోగా శిక్షణ కేంద్రాల్లో మనం చూస్తున్న శారీరకపరమైన ఆసనాలు అప్పట్లో ఉండేవి కాదని మల్లిస్సన్ వివరించారు. జూన్ 21 న యోగా దినోత్సవం జరపాలని ఐక్యరాజ్యసమితికి ప్రధాని మోదీ సూచించారు. 2014లో మోదీ ఐక్యరాజ్య సమితికి ప్రతిపాదించడంతో తొలి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని 2015లో నిర్వహించారు. 2015, జూన్ 21 ప్రపంచ వ్యాప్తంగా మొదటి అంతర్జాతీయ యోగా డేను



నిర్వహించారు. భారత్లో ప్రధాని మోదీ.. న్యూఢిల్లీ లోని రాజ్‌ఢ్ లో నిర్వహించారు. ఆ వేడుకలకు చాలా దేశాలకు చెందిన నేతలు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఆరోజు ప్రధాని మోదీతో పాలు వేల మంది యోగా చేశారు. 84 దేశాల నుంచి వచ్చిన నేతలతో పాటు మొత్తం 35985 మంది ఆరోజు మోదీతో పాటు యోగా చేసి రెండు గిన్నిస్ రికార్డులను నెలకొల్పారు. ఉరుకుల పరుగుల జీవితంలో ప్రశాంతత లేకుండా పోతోందని చాలామంది అంటుంటారు. కానీ, రోజూ సమయం దొరికనప్పుడు చిన్నచిన్న యోగా ఆసనాలు వేయడం మొదలుపెడితే ప్రశాంతత మెరుగు పడుతుంది. గడచిన శతాబ్ద కాలంలో ప్రపంచీకరణలో భాగంగా యోగా కూడా అనేక రూపాలు తీసుకుంది. విభిన్నమైన కొత్త ఆసనాలు ఆచరణలోకి వచ్చాయి. చాలా దేశాల్లో యోగాకు ప్రాధాన్యత కూడా బాగా పెరిగింది. నిత్యం మన దైనందిన జీవితంలో ఎదురయ్యే

పలురకాల వ్యాపకాల మూలంగా తెలియకుండానే మనం శారీరక, మానసిక రుగ్మతలకు గురవుతుండడం సహజం. తద్వారా అనారోగ్యంతో రోగాల బారిన పడడమే కాకుండా మానసిక ఆందోళనలతో ప్రశాంతతను కోల్పోవడం కూడా జరుగుతుంది. ప్రస్తుత తరుణంలో 'యోగ' సాధనకు మించిన సాధనం మరొకటి లేదని నిస్సంకోచంగా చెప్పవచ్చు. 'యోగా'తో శారీరక మానసిక రుగ్మతలకు చెక్ పెట్టి అసలైన ఆరోగ్య, ఆనంద 'యోగా'న్ని మనం సంపూర్ణంగా అనుభవించవచ్చు. ఏ ఆసనం ఎలా వేయాలో అవగాహన ఉంటే చాలు... యోగాను ఎవరైనా, ఎప్పుడైనా, ఎక్కడైనా సాధన చేయొచ్చు. యోగాకు వయసు అడ్డంకి కాదు. చాలామంది ఏడు పదుల వయసులో యోగా చేయడం మొదలుపెడతారు. తాము ఇంకా ముందే ప్రారంభించి ఉంటే బాగుండేదని వారు చెబుతుంటారు. అన్ని వయసుల వారికీ ప్రత్యేకంగా కొన్నిరకాల యోగా ఆసనాలు ఉంటాయి. యోగా అనేది ఒక రకమైన 'వ్యాయామం'. అది చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు ఎవరైనా చేయొచ్చు. శారీరక వైకల్యంతో కుర్చీలోంచి లేవలేని వారికోసం కూడా ప్రత్యేకంగా 'చైర్ యోగా' ఉంది. పతంజలి మహర్షి 'యోగ దర్శిని' ఆధారంగా హరిద్వార్ కేంద్రంగా 'రాందేవా బాబా' స్థాపించిన పతంజలి యోగా ఆశ్రమం కేవలం మన దేశంలోనే కాకుండా విదేశాల్లోనూ యోగా కేంద్రా లను నడుపుతున్నది. శారీరకంగా దృఢంగా ఉన్నవారే యోగా చేయాలన్న షరతు కూడా ఏమీ లేదు. యోగాలో అనేక రకాల ఆసనాలు ఉన్నాయి. ఫిట్నెస్ కు తగ్గట్టుగానే ఆసనాలను ఎంచు కోవచ్చు. యోగాతో మనసుకు ప్రశాంతత, విశ్రాంతి లభిస్తుంది. దాంతో, మానసిక ఆరోగ్యం మెరుగయ్యే అవకాశం ఉంటుంది. ఆసనం వేసి స్థిరంగా ఉండటం వల్ల శరీర అవయ వాలకు మనసుకు మధ్య సమన్వయం మెరుగు పడుతుంది. ఏకాగ్రత పెరుగుతుంది. శరీరంలో నొప్పులు తగ్గేందుకు ప్రెగ్నెన్సీ యోగా ఉపయోగ పడుతుంది. నిద్ర బాగా పడుతుంది. 'ప్రసవానంతర యోగా' ద్వారా మహిళలు త్వరగా మామూలు స్థితికి వచ్చేందుకు వీలుంటుంది. విద్యార్థులు రోజూ యోగా చేస్తే జ్ఞాపకశక్తి పెరిగే అవకాశం ఉంటుంది. మెదడు చురుగ్గా పని చేస్తుంది. యోగాసనాల వల్ల రక్త ప్రసరణ మెరుగవుతుంది. శరీరం నుంచి. వ్యర్థాలు వేగంగా బయటకు వెళ్లిపోతాయి. శారీరక పరమైన సాధనలతో కండారాలు దృఢంగా తయారవుతాయి.

**జూన్ 21...ప్రపంచ యోగా దినోత్సవం**

**- ఆర్‌కేఎస్**
9440595494

## సచివాలయాలను ఆకస్మిక తనిఖీ చేసిన జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్



**విశాఖపట్నం జూన్ 20 మనం న్యూస్:** ప్రజలకు అందించే సేవలు సకాలంలో అందేలా విధులు నిర్వహించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ సచివాలయాల సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆయన ఈస్ట్ జోన్ దసపల్లా హిల్స్ వద్ద ఉన్న 164 ,165 సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ సచివాలయాల్లో ప్రజలకు అందిస్తున్న సేవలు, సిబ్బంది పనితీరు, రోజువారీ విధుల నిర్వహణ తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు. సచివాలయం సిబ్బంది హాజరు వివరాలను, వారికి కేటాయించిన విధులను సచివాలయ అడ్మిన్ చిరంజీవిని అడిగి తెలుసుకొని, ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా సచివాలయ సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కమిషనర్ ఆదేశించారు .ప్రజలు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పెట్టుకున్న అర్జీలను సకాలంలో పరిష్కారం అయ్యేలా చూడాలని, పలు పనులకు సంబంధించిన పురోగతిపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జనగణనకు సంబంధించి సర్ -స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ ఏ విధంగా కొనసాగుతోంది, ప్రోగ్రామ్లో భాగంగా క్షేత్రస్థాయిలో చేపడుతున్న చర్యలు, ప్రజల నుంచి సేకరిస్తున్న వివరాలు, వాటి నమోదు ప్రక్రియపై వివరాలను అడిగి తెలుసుకున్నారు.

# ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

## త్రిశూల్ వద్ద వి ఎం ఆర్ డి ఏ ఆధ్వర్యంలో యోగా సాధన



**విశాఖపట్నం జూన్ 20 మనం న్యూస్:** అంతర్జాతీయ యోగాదినోత్సవం పురస్కరించుకొని వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ , మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్. తేజ్ భరత్ ఆదేశాలతో యోగా దినోత్సవం కైలాసగిరి పై ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం కైలాసగిరి పై ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన త్రిశూల్ వద్ద జరిగిన కార్యక్రమంలో వి ఎం ఆర్ డి ఎ ఉద్యోగులు, యోగాభ్యాసకులు పాల్గొని యోగా సాధన చేశారు. యోగా గురువు మొల్లేటి కిరణ్ యోగా వలన కలిగే ప్రయోజనాలు వివరిస్తూ పలు యోగాసనాలను వేయించారు. ఆయా యోగాసనాల వల్ల మానసిక, శారీరక ఆరోగ్య పరంగా ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయో వివరించారు. ఈ సందర్భంగా వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ ప్రకృతి అందాల నడుమ ఉన్న కైలాసగిరిలో యోగ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనందంగా ఉందని, యోగ అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదు, శరీరం, మనస్సు, ఆత్మ మధ్య సమతుల్యతను సాధించే జీవన విధానమని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చొరవతో, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో యోగ ను మన జీవన విధానంలో ఒక భాగం చేసుకోవాలని పేర్కొన్నారు. నేటి యాంత్రిక జీవనశైలిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి యోగ అత్యంత అవసరమని, యువత ప్రతిరోజూ కొంత సమయం యోగ సాధనకు కేటాయిస్తే శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుంది అని పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగ కీలక పాత్ర పోషిస్తుందని, వి ఎం ఆర్ డి ఎ పరిధిలో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ఆరోగ్యం, పర్యావరణం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రతి కుటుంబంలో యోగ ఒక దినచర్యగా మారాలని ఆకాంక్షిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శి మురళీ కృష్ణ, ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, పర్యవేక్షక ఇంజినీర్ మధుసూదనరావు, అటవీ శాఖ అధికారి రమణమూర్తి , ముఖ్య గణాంక అధికారి హరి ప్రసాద్ , విఎంఆర్డిఏ ఉద్యోగస్తులు, వాల్తేర్ క్లబ్, సెంట్రల్ పార్క్ యోగాభ్యాసకులు పాల్గొన్నారు.

## నీట్ (యూజీ)-2026 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

**సమీక్షలో అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్**

**జిల్లాలో 18 కేంద్రాల్లో పరీక్ష... హాజరుకానున్న 8,015 అభ్యర్థులు**



**విశాఖపట్నం, జూన్ 20 మనం న్యూస్:** ఆదివారం నిర్వహించనున్న నీట్ (యూజీ)-2026 పరీక్షను జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా, పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం కలెక్టరేట్లోని తన ఛాంబర్లో నీట్ పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్, పోలీసు, సీఆర్పీఎఫ్, విద్యా శాఖ తదితర శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 18 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 8,015 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. మధ్యాహ్నం 2.00 నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. దివ్యాంగ అభ్యర్థులకు అదనంగా ఒక గంట సమయం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

అభ్యర్థులను ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మాత్రమే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారని, మధ్యాహ్నం 1.30 గంటలకు కేంద్రాల గేట్లు మూసివేస్తారని స్పష్టం చేశారు. అభ్యర్థులు ముందుగానే కేంద్రాలకు చేరుకుని ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షకు హాజరు కావాలని సూచించారు.పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాలు, అత్యవసర సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సమీక్షలో ఆదేశించారు. కేంద్రాల వద్ద విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది పరీక్ష ప్రారంభానికి ముందుగానే హాజరై తమ బాధ్యతలను నిర్వర్తించాలన్నారు.

# విద్యా సేవలో ఆర్వీఆర్ స్కూల్ ఆదర్శం

- విత‌ంతువులు, అనాథ పిల్లలకు ఉచిత విద్య
- తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్య.. గ్రామీణ విద్యార్థులకు ఆర్వీఆర్ స్కూల్ చేయూత
- సామాజిక బాధ్యతతో ముందుకు ఆర్వీఆర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్
- పేద విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా




**దేవనకొండ, జూన్ 20(మనం న్యూస్):** దేవనకొండ మండలంలోని తెర్నేకల్ గ్రామంలో ఉన్న ప్రైవేట్ విద్యా సంస్థ ఆర్వీఆర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యా రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన విద్య అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో పనిచేస్తున్న ఈ పాఠశాల, సాధారణ కుటుంబాలకు అందుబాటులో ఉండే విధంగా తక్కువ ఫీజులతో విద్యను అందించడంతో పాటు, సామాజిక బాధ్యతను చాటుకుంటూ పలు సేవా కార్యక్రమాలు చేపడుతోంది. ప్రస్తుతం విద్య ఖర్చులు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో అనేక కుటుంబాలు తమ పిల్లలకు మెరుగైన విద్య అందించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. అలాంటి పరిస్థితుల్లో ఆర్వీఆర్ స్కూల్ యాజమాన్యం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఫీజులను సాధ్యమైనంత తక్కువగా నిర్ణయించినట్లు తెలిపింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన రైతు, కూలీ, మధ్యతరగతి కుటుంబాల పిల్లలు ఆర్థిక భారం లేకుండా విద్యను అభ్యసించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొంది. అదేవిధంగా పాఠశాలకు దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల కోసం బస్సు సౌకర్యాన్ని కూడా అందుబాటులో ఉంచింది. బస్సు ఫీజులను సైతం తక్కువగా నిర్ణయించి తల్లిదండ్రులపై అదనపు భారం పడకుండా చూస్తున్నట్లు స్కూల్ యాజమాన్యం వెల్లడించింది. విద్యార్థులు సురక్షితంగా పాఠశాలకు చేరుకోవడంతో పాటు సమయపాలన అలవాటు చేసుకునేందుకు ఈ రవాణా సౌకర్యం ఎంతో ఉపయోగపడుతోందని తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు.

సామాజిక సేవా దృక్పథంతో ఆర్వీఆర్ స్కూల్ మరో ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది. వితంతువుల పిల్లలు, అనాథ పిల్లలకు పూర్తిగా ఉచిత విద్యను అందిస్తున్నట్లు యాజమాన్యం ప్రకటించింది. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన పిల్లలు కూడా ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపింది. విద్య హక్కు ప్రతి చిన్నారికి సమానంగా అందాలని, ఆర్థిక పరిస్థితులు వారి భవిష్యత్తుకు అడ్డంకిగా మారకూడదనే భావనతో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొంది. పాఠశాలలో విద్యతో పాటు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, క్రమశిక్షణ, నైతిక విలువలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నట్లు కరస్పాండెంట్ జె. పద్మ, ప్రిన్సిపాల్ వై. రేఖ, తెలిపారు. ఆధునిక బోధనా పద్ధతులతో పాటు విద్యార్థుల ప్రతిభను వెలికితీసే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా పలువురు తల్లిదండ్రులు మాట్లాడుతూ, గ్రామంలోనే ఇలాంటి సేవా దృక్పథంతో పనిచేస్తున్న విద్యా సంస్థ ఉండటం ఆనం దంగా ఉందన్నారు. ముఖ్యంగా వితంతువులు, అనాథ పిల్లలకు ఉచిత విద్య అందించడం అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

గ్రామీణ ప్రాంతాల్లో విద్యా సేవలను విస్తరిస్తూ, పేద మరియు నిరుపేద విద్యార్థులకు అండగా నిలుస్తున్న ఆర్వీఆర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ సమాజానికి ఆదర్శంగా నిలుస్తోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. విద్య ద్వారా సామాజిక మార్పు సాధ్యమనే నమ్మకంతో ముందుకు సాగుతున్న ఈ సంస్థ మరెందరికో స్ఫూర్తిగా నిలుస్తోంది.

## విశాఖ నగర పోలీసులకు వరుసగా రెండో ఏడాది ప్రతిష్టాత్మక అవార్డు!

**విశాఖపట్నం జూన్ 20 మనం న్యూస్:** విశాఖపట్నం నగర పోలీసు కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి, చొరవతో అమలవుతున్న మిషన్ జ్యోతిర్గమయ భిక్షాటన నిర్మూలన నిరాశ్రయుల పునరావాస కార్యక్రమానికి గుర్తింపుగా, న్యూఢిల్లీలో నిర్వహించిన 103వ ఎస్ కే ఓ సి హెచ్ అవార్డుల ప్రధానోత్సవంలో విశాఖ నగర పోలీసులకు ప్రతిష్టాత్మక స్కాచ్ అవార్డ్ 2026 లభించింది. ఈ కార్యక్రమం ద్వారా 511 మంది యాచకులకు పునరావాసం కల్పించడం, 123 మందిని కుటుంబాలతో కలపడం, వందలాది మందికి ఆశ్రయం, వైద్యం, కౌన్సెలింగ్ అందించడం ద్వారా సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడంలో విశాఖ నగర పోలీసులు విశేష సేవలందించారు. 2025లో రోడ్ ట్రాఫిక్ యాక్సిడెంట్ విక్టిమ్ ఆసీస్ సెంటర్ సేవలకు స్కాచ్ అవార్డు పొందిన విశాఖ నగర పోలీసులు, ఇప్పుడు వరుసగా రెండో ఏడాది ఈ అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకున్నారు.

## దువ్వాడ పై కేసు నమోదు



**హిరమండలం మనం న్యూస్:** దువ్వాడ శ్రీనివాస్ పై హిరమండలం పోలీస్ స్టేషన్ లో కేసు నమోదుచేశారు. ఇటీవల 75 కోట్ల పెందుర్తి పేదల బియ్యం కుంభకోణం పై మంత్రిని ప్రశ్నించినందుకు దువ్వాడ పై చర్యలు. చేపట్టనున్నారు. ఈ నెల 20 లోగా స్వయంగా హిరమండలం పోలీస్ స్టేషన్ కు హాజరు కావాలని దువ్వాడ కు నోటీసులు జారీ చేశారు.గతంలో పవన్ కళ్యాణ్ ని విమర్శించారని రాష్ట్రంలో పలు పోలీస్ స్టేషన్ లలో దువ్వాడ పై కేసులు నమోదు చేశారు .ఆయా కేసులలో దువ్వాడ పై చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించినట్లు బోగట్టా, అందుకు పాత కేసులతో దువ్వాడ ను నిర్భందించాలని తద్వారా దువ్వాడ నోటికి కళ్లెం వెయ్యాలని మంత్రి ఆలోచన.ఈ నెల 22 వ తారీఖున హిరమండలం పోలీస్ స్టేషన్ కు దువ్వాడ హాజరౌవుతారన్నట్లు విశ్వసనీయంగా తెలిసిందే.

# భారత ఆరోగ్య రంగానికి ప్రోటిజెనిక్స్ సేవలు ఆదర్శం

- రాష్ట్రంలోనే తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్న సంస్థ సంకల్పం సంతోషకరం
- ప్రోటీజెనిక్స్ సంస్థను ఆదర్శంగా తీసుకొని స్వదేశంలో పెట్టుబడులు పెట్టండి
- విదేశాల్లో ఉన్న తెలుగువారికి పల్లా శ్రీనివాస్ పిలుపు
- ప్రోటీజెనిక్స్ ప్లాంటును సందర్శించిన ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్



**విశాఖపట్నం జూన్ 20 మనం న్యూస్:** దేశంలో అత్యవసరమైన ప్లాస్మా ఆధారిత ఔషధాల తయారీలో స్వదేశీ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు విశాఖ వేదికగా ప్రోటిజెనిక్స్ సంస్థ చేస్తున్న కృషిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాస్ కొనియాడారు. సంస్థ ప్రతినిధుల ఆహ్వానం మేరకు ఆయన సంస్థ కార్యకలాపాలను పరిశీలించి, సంస్థ యాజమాన్యంతో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా పల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్లో ప్లాస్మా ప్రోటీన్ థెరప్యూటిక్స్పై దృష్టి సారించిన మొట్టమొదటి సంస్థగా ప్రోటిజెనిక్స్ లైఫ్ సైన్సెస్ సంస్థ గుర్తింపు పొందింది. దేశంలో అత్యవసరమైన ప్లాస్మా ఆధారిత ఔషధాల తయారీలో స్వదేశీ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు విశాఖలోని జీనోమ్ వ్యాలీ వేదికగా ప్రోటిజెనిక్స్ చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయం. ఆరోగ్య రంగంలో ఆత్మనిర్భర భారత్ లక్ష్య సాధనకు ఇటువంటి బయోటెక్నాలజీ సంస్థలు కీలక పాత్ర పోషిస్తాయి. 2021లో ఎన్నారై వైద్యుల బృందం స్థాపించిన ఈ సంస్థ ప్రస్తుతం ఇన్ట్రావీనస్ ఇమ్యూనోగ్లోబులిన్ , హ్యూమన్ ఆల్బుమిన్, ఫ్యాక్టర్ ౹ఐఐఐ, ఫ్యాక్టర్ ఐగీ, ఫైబ్రిన్ సీలెంట్ కిట్ వంటి కీలక ప్లాస్మా ఆధారిత ఉత్పత్తుల అభివృద్ధిలో ముందంజలో ఉంది. రోగనిరోధక లోపాలు, ఆటో ఇమ్యూన్ వ్యాధులు, రక్తస్రావ సంబంధిత సమస్యలు, క్యాన్సర్ చికిత్స వంటి రంగాల్లో ఈ ఉత్పత్తులు ఎంతో ఉపయోగకరం.

రాబోయే కాలంలో దేశీయ అవసరాలను తీర్చడంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో కూడా ప్రోటిజెనిక్స్ తన ముద్ర వేయనుంది. ఆంధ్రప్రదేశ్లో బయోటెక్నాలజీ రంగ అభివృద్ధికి విశేష అవకాశాలు ఉన్నాయి. విశాఖపట్నం సహా రాష్ట్రంలోని పారిశ్రామిక వాతావరణం, పెట్టుబడులకు అనుకూలమైన విధానాలు ఇటువంటి పరిశ్రమల అభివృద్ధికి దోహదపడతాయి.

ప్రోటీజెనిక్స్ సంస్థను ఆదర్శంగా తీసుకొని విదేశాల్లో ఉన్న తెలుగువారు స్వదేశంలో పెట్టుబడులు పెట్టండి అని పిలుపునిచ్చారు. సంస్థను సందర్శించిన సందర్భంగా ప్రభుత్వం నుండి ప్రోత్సాహం, సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని పల్లా శ్రీనివాస్ హామీ ఇచ్చారు. ప్రజల ఆరోగ్య భద్రతకు, దేశ వైద్య రంగ స్వావలంబనకు తోడ్పడే సంస్థలతో ప్రభుత్వం, సమాజం కలిసి నడవాల్సిన అవసరం ఉందన్నారు.

# రైతులకు మేలు జరిగే పనులకే అధిక ప్రాధాన్యత- మంత్రి నిమ్మల

**పాలకొల్లులో అన్నదాత సుఖీభవ కింద 9.40 కోట్ల సాయం**



**పాలకొల్లు, జూన్ 20,మనం ప్రతి నిధి:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతిగా పనిచేస్తుందని,ఈ రెండేళ్లలో రైతులకు మేలు జరిగే పనులకే అధిక అధిక ప్రాధాన్యతనిస్తున్నాను. రైతులకు అవసరమైన ఎటువంటి పనినైనా కాకితో కబురు చేస్తే చాలు వెంటనే పని జరిగేలా ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు చెప్పారు. యలమంచిలి మండలం కొంతేరు గ్రామంలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ కింద 2026-27 తొలి విడత సాయంగా 14,458 మంది రైతులకు రూ.9.40 కోట్ల చెక్కును అందజేసిన కార్యక్రమంలో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో 46.85 లక్షల మంది రైతులకు ₹3,125 కోట్లు విడుదల అందిస్తున్నామని, 2025-26లో మూడు విడతలుగా 46 లక్షల మందికి ₹8,965 కోట్లు అందజేశామన్నారు. రైతుల పెట్టుబడి భారం తగ్గించడమే లక్ష్యంగా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయన్నారు. వ్యవసాయం లాభసాటిగా మారేందుకు కూటమి కృషి కృషి చేస్తుందని తెలిపారు. గత వైసిపి పాలనలో రైతులు ధాన్యం అమ్మకానికి మిల్లుల వద్ద వారం రోజులు రాత్రింబవళ్లు రోజులు పడిగాపులు పడాల్సి వచ్చేదని, నచ్చిన మిల్లుకు అమ్ముకునే స్వేచ్ఛ లేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రైతులకు పూర్తి స్వేచ్ఛ కల్పించిందని మంత్రి స్పష్టం చేశారు. 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని, గత ప్రభుత్వం బకాయి పెట్టిన ₹1 640 కోట్ల ధాన్యం చెల్లింపులు చేసామన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తో రైతుల ఆస్తులపై ప్రమాదకర నిర్ణయాలను గత ప్రభుత్వం తీసుకువచ్చిందని, ఆ చట్టాన్ని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చంద్రబాబు రద్దు చేశారని గుర్తుచేశారు. పట్టాదారు పాస్ పుస్తకాలపై జగన్ బొమ్మ వేసుకుంటే ప్రస్తుతం రాజముద్రతో పాస్ పుస్తకాలు అందజేస్తున్నామని స్పష్టంచేశారు. గతంలో సాగునీటి వ్యవస్థ నిర్లక్ష్యానికి గురైందని, ఇప్పుడు కాలువలు, డ్రైన్ల అభివృద్ధికి పెద్దపీట రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పాలకొల్లు నియోజకవర్గంలో రెండేళ్లలో 980 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టామని ప్రధానంగా రైతులకు అవసరమైన పనులకే అధిక ప్రాధాన్యత నిచ్చినట్లు చెప్పారు. పనిచేసే ప్రభుత్వాన్ని, పనిచేసే నాయకుడిని ఎల్లప్పుడూ ఆశీర్వదించాలని మంత్రి కోరారు.ఆర్ డి ఓ దాసి రాజు,అంగర రామ్మోహన్, కబర్ది, బొప్ప హరి కిషోర్, బోనం నాని,కడలి గోపి, పాల్గొన్నారు.




## వైఎస్ జగన్ను కలిసిన నర్సీపట్నం మాజీ మున్సిపల్ చైర్మన్ కుటుంబ సభ్యులు

**విజయవాడ జూన్ 20 మనం న్యూస్:** విజయవాడలో బుధవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని నర్సీపట్నం మాజీ మున్సిపల్ చైర్మన్ చింతకాయల అనిత సన్యాసిపాత్రుడు కుమారుడు దొరబాబు తో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా స్థానిక రాజకీయ పరిణామాలు, నర్సీపట్నం నియోజకవర్గ పరిస్థితులు మరియు పార్టీ బలోపేతానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించినట్లు సమాచారం. అనంతరం దొరబాబు వైఎస్ జగన్కు శుభాకాంక్షలు తెలియజేసి, ఆయన ఆశీస్సులు పొందారు.

## రైతులకు వరం అన్నదాత సుఖీభవ పథకం

- ‘వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ అప్పా వేణుగోపాల్



**తుగ్గలి, జూన్ 20 (మనం న్యూస్ ):** రైతుల అభివృద్ధికి అన్నదాత సుఖీభవ పథకం ఒక వరం లాంటిదని ఉప్పర్లపల్లె వ్యవసాయ పరస్పర సహకార సంఘం చైర్మన్ అప్పా వేణుగోపాల్ అన్నారు. శనివారం ఉప్పర్లపల్లె గ్రామ సచివాలయంలో అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిదారులతో కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని టీవీ ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా అప్పా వేణుగోపాల్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని, అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు ఆర్థిక భరోసా కలుగుతుందని తెలిపారు. వ్యవసాయ రంగం అభివృద్ధికి ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు నీలా మనోహర్, సచివాలయ ఉద్యోగులు, రైతులు పాల్గొన్నారు.

## గిరిజన ప్రాంతాల్లో సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరాలు, పింక్ బస్ క్యాంపులు

- స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్ వి కుమార్



**తిరుపతి, జూన్ 20 మనం న్యూస్:** ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు తిరుమల తిరుపతి దేవస్థానం వారి సహకారంతో గిరిజన ప్రాంతాల్లో సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరాలు, పింక్ బస్సుల ద్వారా ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాలకు శ్రీకారం చుట్టినట్లు శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) సంచాలకులు ఉపకులపతి డాక్టర్ ఆర్ వి కుమార్ వెల్లడించారు. స్విమ్స్ ఆధ్వర్యంలో ప్రజా ప్రగతి ట్రస్టు ఛైర్మన్ ఎం.శ్రీనివాసులు సహకారంతో శనివారం తిరుపతి జిల్లా కెవిబి పురం మండలం, కోవనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు పరిసర ప్రాంతాల్లోని గిరిజన మహిళలు, పురుషులకు సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరం, పింక్ బస్ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ ఆర్ వి కుమార్ మాట్లాడుతూ పేద ప్రజల కోసం గ్రామ, పట్టణ స్థాయిలో రెండు పింక్ బస్సుల ద్వారా క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. క్యాన్సర్ నిర్ధారణ అయితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం డా॥ ఎన్.టి.ఆర్. వైద్య సేవ ట్రస్టు ద్వారా ఉచితంగా చికిత్స అందిస్తామన్నారు. రూ.5000/- నుండి రూ.10,000/ - వరకు విలువైన వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు.

2018వ సంవత్సరం నుంచి ఇప్పటి వరకు రెండు పింక్ బస్సుల ద్వారా 770 క్యాంపులు నిర్వహించి 43,596 మందికి స్క్రీనింగ్ నిర్వహించామన్నారు. మొత్తం ఇప్పటివరకు 3,043 మందిని స్విమ్స్ కు రెఫర్ చేయడం జరిగింది. వీరిలో 776 మందికి శస్త్ర చికిత్సలతో పాటు అవసరమైన వైద్యం అందించి క్యాన్సరు వ్యాధిని నయం చేయడం జరిగిందని తెలియజేశారు. తిరుపతి జిల్లాలోని పి.హెచ్. సిలతో పాటు అమరావతిలోని రాష్ట్ర సచివాలయం, నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గం మహిమలూరు, కీలపట్ల, శ్రీహరికోటలోని కేంద్ర ప్రభుత్వ సంస్థ షార్ అంతరిక్ష కేంద్రం, చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం తదితర ప్రాంతాల్లో పింక్ బస్ ద్వారా ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహించామన్నారు.

# పేకాట శిబిరంపై దాడి: ఐదుగురు అరెస్ట్

- 53,000 నగదు స్వాధీనం



**అనకాపల్లి (చీడికాడ), జూన్ 20 మనం న్యూస్ :** జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు, జిల్లాలో అసాంఘిక కార్యకలాపాల అణచివేతలో భాగంగా పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా కె.కోటపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ కృష్ణ ఆధ్వర్యంలో, చీడికాడ ఎస్సై నారాయణరావు మరియు వారి పోలీస్ సిబ్బంది శనివారం ప్రత్యేక నిఘా నిర్వహించారు. చీడికాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని కోనం శివారు ప్రాంతంలో కొందరు వ్యక్తులు రహస్యంగా పేకాట ఆడుతున్నట్లు అందిన నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు మెరుపు దాడి చేశారు.

పేకాట ఆడుతూ దొరికిన ఐదుగురు (5) నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

**నగదు స్వాధీనం:** నిందితుల వద్ద నుండి ₹53,000/- నగదును, పేకాట సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇటువంటి అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా పోలీస్ అధికారులు హెచ్చరించారు.


# అన్నదాత సుఖీభవ నిధులతో రైతు కుటుంబాలకు అండగా కూటమి ప్రభుత్వం

- రైతు సంక్షేమమే చంద్రబాబు ప్రభుత్వ ధ్యేయం
- ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ
- ఆచంట నియోజకవర్గంలో 19,175 మంది రైతు కుటుంబాలకు రూ.12.75,19000 కోట్లకు పైగా పెట్టుబడి సాయం.
- రైతుల శ్రమకు గౌరవం ఇచ్చే ప్రభుత్వం నేడు అధికారంలో ఉందని ప్రశంసలు



పోడూరు జూన్ 20 మనం న్యూస్ : అన్నదాత సుఖీభవ,పీఎం కిసాన్ పథకం కింద రెండవ సంవత్సరం మొదటి విడతగా రైతుల ఖాతాల్లో రూ.7 వేల చొప్పున పెట్టుబడి సాయం జమ కానున్న సందర్భంగా పోడూరు మండలం, పోడూరు గ్రామంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆచంట నియోజకవర్గ స్థాయి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆచంట, పోడూరు, పెనుమంట్ర, పెనుగొండ మండలాలకు చెందిన 19,175 మంది రైతు కుటుంబాలకు రూ.12,75,19,000 నిధులు జమ కానున్నాయని కార్యక్రమంలో వెల్లడించారు.ఈ కార్యక్రమం పోడూరు టిడిపి నాయకుల ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిర్వహించగా రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యులు పితాని సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను వరుసగా అమలు చేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకున్న నాయకుడని కొనియాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కార్యరూపంలో చూపించడం కూటమి ప్రభుత్వ ప్రత్యేకత అని పేర్కొన్నారు.రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతు పండించిన ప్రతి గింజకు గౌరవం దక్కేలా చర్యలు తీసుకుంటోందని అన్నారు. గతంలో రైతులు పంటను విక్రయించిన తరువాత చెల్లింపుల కోసం నెలల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేదని, ప్రస్తుతం రైతుల శ్రమ విలువ తెలిసిన నాయకత్వం రాష్ట్రంలో ఉండటంతో గడిచిన రబీ సీజన్లో పంట విక్రయించిన రైతుల ఖాతాల్లో 24 గంటల్లోనే నిధులు జమ చేసిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని చెప్పారు.రైతు బలపడితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు విత్తనాలు, సాగునీరు, మద్దతు ధర, పెట్టుబడి సాయం వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని పేర్కొన్నారు. రైతు కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే అన్నదాత సుఖీభవ పథకం ప్రధాన లక్ష్యమని వివరించారు.అలాగే గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళల పెన్షన్ల పెంపుపై ఆలస్యం జరిగిందని ఆరోపించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రూ.4 వేల పెన్షన్ అందిస్తామని ఇచ్చిన హామీని మొదటి నెలలోనే అమలు చేసిన నాయకుడు చంద్రబాబు నాయుడు అని పేర్కొన్నారు. అలాంటి దూరదృష్టి కలిగిన నాయకత్వాన్ని విమర్శించడం సరికాదని అన్నారు.ఈ సందర్భంగా పెనుగొండ ఏఎంసీ చైర్మన్ బడేటి బ్రహ్మాజీ బుజ్జి, పశ్చిమగోదావరి జిల్లా టిడిపి మాజీ ఉపాధ్యక్షులు రుద్రరాజు రవిరాజు, గుమ్ములూరు మాజీ సర్పంచ్ కుక్కల దుర్గారావు, జనసేన మండల అధ్యక్షులు రావి హరీష్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు స్వాగతిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతిపక్షాల విమర్శలకు ప్రజలే సమాధానం చెబుతారని అన్నారు.ఈ కార్యక్రమంలో పోడూరు మండల టిడిపి అధ్యక్షులు రుద్రరాజు రమేష్ రాజు, ఆచంట ఏఎంసీ చైర్మన్ కేత సత్యవతి మీరయ్య, వేమవరం సొసైటీ అధ్యక్షులు నెక్కంటి సత్తిబాబు, ఆచంట ఏఎంసీ డైరెక్టర్లు ఊడిగ శ్రీనివాస్, బండి సత్యనారాయణ, పోడూరు సొసైటీ అధ్యక్షులు దొమ్మేటి పురుషోత్తం, మాజీ సర్పంచ్ చెట్టుబత్తుల సువర్ణ రాజు, సిద్ధాంతం నీటి సంఘం అధ్యక్షులు తమ్మినీడి ప్రసాద్, పెనుమంట్ర టిడిపి అధ్యక్షులు వెలగల బుల్లిరామిరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ శిలబోయిన జయరామకృష్ణ, పోడూరు గ్రామ టిడిపి అధ్యక్షులు బొంతు కాశీ విశ్వనాథ్, టిడిపి యువజన అధ్యక్షులు శ్రీకాంత్, టిడిపి నాయకులు కౌరు ఈశ్వరరావు, రుద్రరాజు బంగారు రాజు (బంగారం), దొంగ సూర్య వరప్రసాద్, గుడాల దుర్గారావు, జనసేన మండల ఉపాధ్యక్షులు తోలేటి వేణు తదితరులు పాల్గొన్నారు. రైతులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## సర్‌లో అక్రమాలపై అప్రమత్తంగా ఉండాలి



శంఖవరం జూన్ 20 మనం ప్రతినిధి : ఓటర్ల జాబితా సవరణ అక్రమాలపై అప్రమత్తంగా ఉండాలని బహుజన సమాజ్ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గం ఇంచార్జ్ గునపర్తి అపురూప్ అన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను అడ్డుపెట్టుకొని అధికార పార్టీ చేసే కుట్రని తిప్పి కొట్టేందుకు నాయకులు కార్యకర్తలు నిరంతరం నిఘా పెట్టాలని సూచించారు. ఓటర్ల హక్కుని కాపాడే బాధ్యత బిఎస్‌పి లదే అన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడే బాధ్యత బిఎల్‌ఎ ల పై ఉందన్నారు. ప్రత్యేక సవరణ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించడం, అనర్హులను చేర్చడం, మ్యాపింగ్ ప్రక్రియలో అక్రమాలకు పాల్పడటం ప్రజాస్వామ్యంలో ప్రమాదకరమన్నారు. ప్రతి బూత్ పరిధిలో ఓటర్ల జాబితాను నిశితంగా పరిశీలించి అక్రమాలకు పాల్పడితే తన దృష్టికి తీసుకురావాలని నాయకులకు కార్యకర్తలకు బూత్ లెవెల్ ఏజెంట్లకు తెలియజేశారు.

## 24 నుండి పాలిటెక్నిక్ ధృవపత్రాల పరిశీలన

నరసాపురం, జూన్ 20 (మనం న్యూస్): పాలీసెట్ 2026 పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని విద్యార్థులకు ధృవపత్రాల పరిశీలనకు ప్రకటన విడుదల అయిందని స్థానిక స్వర్ణాంధ్ర పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎమ్.ఎస్ కిరణ్మయి తెలిపారు. ఈ నెల 24 వ తేదీ నుండి ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి ధ్రువపత్రాల పరిశీలనకు సీతారాంపురం స్వర్ణాంధ్ర పాలిటెక్నిక్ కళాశాల నందు ఏర్పాటుచేసిన హెల్ప్ లైన్ సెంటరుకు హాజరవ్వచ్చని ఆమె తెలిపారు, ఈ నెల 29 నుండి వెబ్ ఆప్షన్స్ నమోదు చేసుకోవచ్చని అన్ని సెలవు దినాల్లో హెల్ప్ లైన్ సెంటరు అందుబాటులో ఉంటుందని మరిన్ని వివరాలకు కళాశాల ఆఫీసు నందు సంప్రదించాలని ప్రిన్సిపాల్ కిరణ్మయి తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్వర్ణాంధ్ర విద్యాసంస్థల చైర్మన్ కె.వి సత్యనారాయణ (కెవిఎస్), కోశాధికారి కె.వి స్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి కోరారు

## రత్నగిరిపై భక్తుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు



అన్నవరం, జూన్ 20, మనం న్యూస్ : కాకినాడ జిల్లా అన్నవరం రత్నగిరి కొండపై ఉన్న రాజా వెంకటరామరాయ కళామందిరం వేదిక వద్ద దేవస్థానం ఆధ్వర్యంలో భక్తుల ఆధ్యాత్మిక, సాంస్కృతిక వినోదం కోసం ప్రత్యేక కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. స్వామివారి దర్శనానికి విచ్చేసిన భక్తులు ఈ కార్యక్రమాలను ఆసక్తిగా వీక్షించి ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమాలలో భక్తి గీతాలాపనలు, హరికథ, నృత్య ప్రదర్శనలు, ఆధ్యాత్మిక సందేశాలతో కూడిన సాంస్కృతిక అంశాలు చోటుచేసుకున్నాయి. కళాకారులు తమ ప్రతిభతో భక్తులను ఆకట్టుకోగా, ఆధ్యాత్మిక వాతావరణంలో కార్యక్రమాలు కొనసాగాయి. దేవస్థానం భక్తులకు దర్శనంతో పాటు ఆధ్యాత్మిక చైతన్యం, సాంస్కృతిక విలువలను చేరువ చేయాలనే ఉద్దేశంతో ఇటువంటి కార్యక్రమాలను తరచూ నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు కార్యక్రమాలను వీక్షించి నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా కళామందిరం ప్రాంగణం భక్తులతో సందడిగా మారగా, సాంస్కృతిక కార్యక్రమాలు అన్నవరం క్షేత్ర ఆధ్యాత్మిక మహిమను మరింత ప్రతిబింబించాయని పలువురు అభిప్రాయపడ్డారు.

### భక్తుల సౌకర్యార్థం పులిహోర, మజ్జిగ పంపిణీ

అన్నవరం రత్నగిరిపై భక్తుల సౌకర్యార్థం సర్క్యులర్ మండపం వద్ద శనివారం పులిహోర, మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. దేవస్థానం అన్నదానం విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఉచితంగా ప్రసాదాన్ని అందజేశారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని మజ్జిగ పంపిణీ చేయడం భక్తులకు ఉపశమనంగా నిలిచింది. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ సేవలను వినియోగించుకున్నారు. ప్రసాదం పంపిణీని అన్నదానం సిబ్బంది క్రమబద్ధంగా నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దేవస్థానం చేపడుతున్న ఈ సేవా కార్యక్రమాలను భక్తులు అభినందించారు. భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు ఆడింది ఆట.. పాడింది పాట

- కత్తిపూడిలో భారీగా పెంచిన ప్రైవేట్ స్కూల్ ఫీజులు

శంఖవరం జూన్ 20 మనం ప్రతినిధి: సర్కార్ పట్టించుకోకపోవడం.. విద్యాశాఖ దృష్టిపెట్టకపోవడంతో మండలం లో ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు ఆడింది ఆట.. పాడింది పాట అన్నట్టుగా సాగుతున్నది. యాజమాన్యాల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతున్నది. ఎడా పెడా ఫీజులు పెంచేస్తున్నాయి. ప్రత్యేకించి ఈ విద్యాసంవత్సరం కొన్ని యాజమాన్యాలైతే ఫీజులను అమాంతం పెంచేశాయి. కొన్ని స్కూళ్లు 20-30% ఫీజులు పెంచగా.. ఇంకా కొన్ని యాజమాన్యాలైతే 50% పెంచినట్టు శంఖవరం మండలం కత్తిపూడి గ్రామంలో ఉన్న ప్రైవేట్ విద్యా సంస్థల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. దీంతో తల్లిదండ్రులకు భారం తప్పడంలేదు. పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, ఇతర సామగ్రి ధరలు కూడా పెంచేశాయి. వీటిని బడుల్లోనే కొనాలని షరతు విధించి అందినకాడికి దండుకుంటున్నాయి. జూన్ మొదటి వారం నుంచి విక్రయాలు, ఫీజుల వసూళ్లు జోరందుకున్నాయి. యాజమాన్యాలు తల్లిదండ్రులకు ఫోన్లు చేసి




ఫీజులు కట్టించుకుంటున్నాయి.

### ఉల్లంఘనలకు తప్పదు భారీ జరిమానా..

పాఠశాల విద్యార్థుల ఫీజుల నియంత్రణ చట్టం నిబంధనలు ఉల్లంఘనలకు పాల్పడే యాజమాన్యాలపై భారీ జరిమానాలు విధించే విధంగా పొందుపరుస్తున్నారు. మొదటి సారి ఉల్లంఘిస్తే రూ.5లక్షల వరకు, రెండో సారి ఉల్లంఘనలను గుర్తిస్తే రూ.10లక్షల వరకు జరిమానా విధించే విధంగా నిబంధనలు పెడుతున్నారు.

మూడో సారి పాఠశాల గుర్తింపు రద్దుకు చర్యలు ఉండే విధంగా చట్టం రూపకల్పన చేస్తున్నారు. అధిక ఫీజు వసూలు చేసినట్టు రుజువైతే ఆ విద్యార్థి తల్లిదండ్రులు చెల్లించిన ఫీజుకు రెట్టింపు యాజమాన్యం చెల్లించాల్సి ఉంటుంది. ఫీజుల అనుమతులపై చట్టంలో స్పష్టత కనిపించడం లేదు. నిబంధనలు గాలికి వదిలేసి రాజకీయ నాయకులతో చేతులు కలుపుతూ మాదే హవా అంటూ కొనసాగుతున్నారు. ఫీజుల నియంత్రణకు, రెగ్యులేషన్కు ప్రభుత్వం తెస్తున్న ముసాయిదాలో పాఠశాలలో ఏ ఫీజులు వసూలు చేయాలి, ఏవీ చేయకూడదనేది స్పష్టంగా పేర్కొంటున్నప్పటికీ మండలంలో విద్యాశాఖ అధికారులు చూస్తూ చూడనట్టు వ్యవహరించడం విడ్డూరంగా ఉంది. ప్రస్తుతం కొన్ని పాఠశాలల్లో అమలు చేస్తున్న అడ్మిషన్ ఫీజు, డోనేషన్, బిల్డింగ్ ఫండ్, యూనిఫాం వంటి అదనపు ఫీజులు వసూలు చేయకూడదు. యూనిఫాం, పుస్తకాల వంటివి విక్రయించి వ్యాపారం చేయవద్దు. ట్యూషన్ ఫీజును వార్షికంగా ఏకరీతిగానే వసూలు చేయాలి. ఐచ్ఛికం సేవలుగా స్కూల్ బస్సు రవాణా, బోర్డింగ్, ప్రత్యేక కోచింగ్ వంటి సేవలకు ప్రత్యేకంగా ఫీజులువసూలు చేసుకోవచ్చు. ఫీజుల పెంపు రెండేళ్లకోసారి ధరల సూచికి అనుగుణంగా మాత్రమే చేయాలనే నిబంధనలు మండల స్థాయి విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ విద్యాసంస్థలకు తెలియజేసినట్లు దాఖలాలు లేవు. సామాన్యుడు ఉన్నతమైన విద్యను అభ్యసించాలంటే ప్రభుత్వ బంధనలు అధికారులు ప్రైవేట్ విద్యా సంస్థలకు కఠినంగా అమలు చేయాలని కోరారు.

## బాల్య వివాహాలను నిరోధిద్దాం




- బడి ఈడు వయసులో చదువుకోనిద్దాం

ముమ్మిడివరం, జూన్ 20, మనం న్యూస్: డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం పరిధిలోని ఐ పోలవరం మండలం ఎదుర్లంక గ్రామంలో శనివారం బీమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో బాల్యవివాహాలు,కౌమార దశలో గర్భాలు,మహిళా చట్టాలు మరియు హక్కులను గూర్చి సామూహిక ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీమాబాయి మహిళా మండలి ప్రాజెక్టు డైరెక్టర్ వాసంశెట్టి నందివర్ధన మాట్లాడుతూ బడి ఈడు వయసులో చదువుకోనీయకుండా వివాహాలు చేయడం వల్ల అనారోగ్య సమస్యలు ఏర్పడడంతో పాటు,సరియైన చదువు లేక, ఉపాధి లేక సమస్యలతో సతమతం కావలసిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని వివరించారు. మండల లెవెల్ ఇంప్లిమెంటరు కే శివ శంకర్ మాట్లాడుతూ మహిళా మరియు బాలల చట్టాలను గురించి వివరించారు. ఈ సందర్భంగా సామూహిక ప్రదర్శనను నిర్వహించి బాల్యవివాహాలను నిరోధిద్దాం,బడి ఈడు వయసులో చదువుకొనిద్దాం అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా చిత్రాలతో కూడిన సమాచార కరపత్రికలను అవగాహన నిమిత్తం స్థానిక ప్రజలకు పంపిణీ చేశారు.

## అన్నవరం కొండపై భద్రతా తనిఖీలు గాలికొదిలినట్లేనా..?

భద్రతా సిబ్బంది నిర్లక్ష్యమా..లేక కొరవడిన అధికారుల పర్యవేక్షణ!

అన్నవరం, జూన్ 20, మనం న్యూస్ : అన్నవరం రత్నగిరి కొండపైకి ఘాట్ రోడ్డు ద్వారా ప్రవేశించే ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాల తనిఖీల విషయంలో భద్రతా వ్యవస్థపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కొండపైకి వెళ్లే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, చట్టవిరుద్ధ వస్తువులు, మద్యం, ఇతర నిషేధిత సామగ్రి తరలిపోకుండా చూడాల్సిన బాధ్యత సెక్యూరిటీ సిబ్బందిపై ఉన్నప్పటికీ, ప్రస్తుతం ఆ తనిఖీలు నామమాత్రంగా మారాయని భక్తులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలోకొండపైకి కార్లలో మద్యం బాటిళ్లు తరలించిన ఘటనలు వెలుగులోకి వచ్చినప్పటికీ, వాటి నుంచి పాఠాలు నేర్చుకుని భద్రతను మరింత కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఉన్న సమయంలో తనిఖీలు సక్రమంగా జరగకపోవడం ఆందోళన కలిగిస్తోంది. టోల్గేట్ వద్ద ఏర్పాటు చేసిన భద్రతా సిబ్బంది చాలా సందర్భాల్లో వాహనాలను ఆపకుండా నేరుగా అనుమతిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలైన తిరుమల తిరుపతి దేవస్థానంతో పాటు ఇతర ప్రధాన ఆలయాల్లో వాహనాల తనిఖీలు, భక్తుల భద్రతా చర్యలు కఠినంగా అమలు చేస్తున్న నేపథ్యంలో, అన్నవరం దేవస్థానంలో మాత్రం ఆ స్థాయి అప్రమత్తత కనిపించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొండపైకి ప్రతిరోజూ వేలాది మంది భక్తులు చేరుకుంటుండటంతో భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికీ తావు




ఉండకూడదని భక్తులు కోరుతున్నారు. టోల్గేట్ వద్ద సీసీ కెమెరాల పర్యవేక్షణతో పాటు ప్రతి వాహనాన్ని తనిఖీ చేసే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు. అలాగే భద్రతా సిబ్బంది విధుల నిర్వహణపై ఉన్నతాధికారులు తరచూ తనిఖీలు నిర్వహించి బాధ్యతాయుతంగా పనిచేసేలా చూడాలని డిమాండ్ చేస్తున్నారు. భక్తుల భద్రత, ఆలయ పవిత్రత దృష్ట్యా కొండపైకి వెళ్లే వాహనాల తనిఖీలను కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ అంశంపై దేవస్థానం అధికారులు స్పందించి తగిన చర్యలు చేపడతారా లేదా అనేది వేచి చూడాల్సి ఉంది.

## రైతుల అభ్యున్నతి, సంక్షేమం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

శంఖవరం జూన్ 20మనం ప్రతినిధి: రైతుల అభ్యున్నతి, సంక్షేమం కోసం తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తామని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సభా వేదికగా స్పష్టం చేశారు. శంఖవరం మండలం కత్తిపూడి (సీతంపేట)లో అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ 2026 వ 27 సంవత్సర మొదటి విడత పంపిణీ లాంచనంగా ప్రారంభించారు. అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ నిధులు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ విడుదల చేశారు. రైతులు ఖాతాలోకి నేరుగా అన్నదాత సుఖీభవ ద్వారా రూ. 5వేలు, పీఎం కిసాన్ పథకం ద్వారా 2వేల రూపాయల నేరుగా జమ చేయడం జరుగుతుంది. ఈ పథకం ద్వారా ప్రత్తిపాడు నియోజకవర్గంలో 31634 మంది రైతులకు చేకూరగా 20.78 కోట్ల లబ్ది పొందనన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ,ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్ ప్రారంభ దశలో రైతులకు చేయదించే విధంగా అన్నదాత సుఖీభవ పథకాన్ని నేరుగా రైతులు ఖాతాల్లోకి ఈరోజు జమ చేయనున్నారని అన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, సారథ్యంలో అభివృద్ధి సంక్షేమాలు పరుగులు పెడుతున్నాయని అభివర్ణించారు. నియోజకవర్గ రైతులను అన్ని విధాల ఆదుకుంటామని ఈ సందర్భంగా భరోసాని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా శివ, ఖాదీ చిన్న పరిశ్రమల వైస్ చైర్మన్ కొమ్ముల కన్నబాబు, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, గంటుమల్ల రాజ్యలక్ష్మి, ప్రత్తిపాడు మార్కెట్ యార్డ్ చైర్మన్ బద్ది మణి రామారావు, మండల పార్టీ అధ్యక్షులు జ్యోతుల పెద్దబాబు, ఈగల దేవుళ్ళు, అలమడ చలమయ్య, బొదిరెడ్డి గోపి, పైలా సాంబశివరావు, ఇతౌశెట్టి భాస్కర్ బాబు, ప్రత్తిపాడు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు, వజ్ర కూటం మాజీ సర్పంచ్ కీర్తి సుభాష్, వేర్ల సూరిబాబు, గాబు కృష్ణమూర్తి, బొమ్మిడి సత్తిబాబు, బస్సా ప్రసాద్, మైరాల కనకారావు, మంతిన వెంకటరమణ, సాధనాల లక్ష్మీ బాబు, గొంది టిడిపి నాయకురాలు వనలక్ష్మి, సూతి భూరయ్య, ఏవోలు, పడాల గాంధీ, ఏ రాజేష్, జోక అమృత, ఆర్ ఈశ్వరరావు, పలువురు కూటమి పార్టీ నాయకులు కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.



## సత్యదేవుని దర్శించుకున్న మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ




అన్నవరం, జూన్ 20, మనం న్యూస్ : మాజీ మంత్రి, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శనివారం కుటుంబ సమేతంగా అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న కన్నా లక్ష్మీనారాయణకు దేవస్థానం అధికారులు, ఆలయ అర్చకులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. దర్శనం అనంతరం వేద పండితులు వేద మంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనం అందించారు. దేవస్థానం అధికారులు స్వామివారి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తులు కన్నా లక్ష్మీనారాయణను కలుసుకుని అభివాదం చేశారు. కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, అర్చకులు, ప్రజాప్రతినిధులు మరియు భక్తులు పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్న కన్నా లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులు దేవస్థానం ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది.

## భద్రతా వైఫల్యంపై స్పందించిన దేవస్థానం అధికారులు

- మనం వార్తకు స్పందన
- సత్య గిరికి వెళ్లే మార్గంలో సెక్యూరిటీ గార్డుల నియామకం

అన్నవరం, జూన్ 20, మనం న్యూస్ : అన్నవరం రత్నగిరిపై భద్రతా వైఫల్యాలపై శుక్రవారం ప్రచురితమైన వార్తా కథనానికి దేవస్థానం అధికారులు స్పందించారు. కొండపై భక్తుల భద్రత, ఆలయ పరిసరాల పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో తక్షణ చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో కొండపై సీఆర్వో కార్యాలయం వెనుక భాగంలో ఉన్న హరిహర సదన్కు వెళ్లే మార్గంలోని కూడలి వద్ద ప్రత్యేకంగా సెక్యూరిటీ గార్డులను నియమించారు. గతంలో ఈ ప్రాంతంలో పర్యవేక్షణ లోపించిందని, అనుమానాస్పద వ్యక్తుల రాకపోకలు మరియు ఇతర అవాంఛనీయ కార్యకలాపాలకు అవకాశం




ఉందనే విమర్శలు వినిపించాయి. వార్త ప్రచురితమైన అనంతరం అధికారులు పరిస్థితిని సమీక్షించి, ఆ ప్రాంతంలో నిరంతర నిఘా ఉండేలా భద్రతా సిబ్బందిని విధుల్లోకి తీసుకువచ్చారు. భక్తులు, స్థానికులు కూడా ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ, కొండపై మిగిలిన సున్నిత ప్రాంతాల్లో కూడా భద్రతను మరింత పటిష్టం చేయాలని కోరుతున్నారు. దేవస్థానం పరిధిలో భద్రతా వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చేందుకు అధికారులు తీసుకుంటున్న చర్యలు కొనసాగుతాయని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తాయని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి.

## ముమ్మిడివరంలో స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలు

ముమ్మిడివరం,జూన్ 20, మనం న్యూస్: ముమ్మిడివరం నగర పంచాయతి కమిషనర్ పి.రవి వర్మ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రతీ మూడవ శనివారం నిర్వహించే స్వర్ణ ఆంద్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా నీరు మీరులో నీటి లభ్యత-వినియోగం, నీటి వృధాను నివారించడం, రుతుపవనాలు , పరిశుభ్రత, జల ధార - జల హారతి అనే ఉద్దేశాలతో జరుగుతున్న ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో శనివారం నగర పంచాయతి డంపింగ్ యార్డు వద్ద గ్రీన్ బెల్ట్ ఏర్పాటు చేయుటకు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నగర పంచాయతి కార్యాలయం వద్ద మెప్మా ఆధ్వర్యంలో రంగవల్లి వేసి స్వర్ణ ఆంద్ర - స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కమిషనర్ రవి వర్మ మాట్లాడుతూ స్వచ్ఛ ముమ్మిడివరం సాధించాలంటే ప్రజల భాగస్వామ్యం చాలా కీలకమని, ప్రభుత్వం ప్రజలలో అవగాహన కల్పించుటకు నెల రోజులుగా పలు కార్యక్రమాలలో భాగంగా డ్రైన్ల లో పూడిక




తీయుట, రోడ్లు శుభ్రపరుచుట, సిటిజెన్ ఫీడ్ బ్యాక్ , ర్యాలీలు నిర్వహించి, ప్రజలలో, వ్యాపారస్తులలో, పౌరులలో పర్యావరణాన్ని కాపాడడంలో ప్రతీ ఒక్కరు భాద్యతగా ఉండాలని కోరారు. పై అన్ని కార్యక్రమాలు విజయవంతంగా పూర్తి చేయుటకు ప్రజలు ఎంతో సహకరించారని అలాగే మెప్మా సిబ్బంది చాల కష్టపడి విధులు నిర్వర్తించారని, స్వచ్ఛ సర్వేక్షన్ టీం పర్యవేక్షణలో శానిటేషన్ సిబ్బంది సేవలు అమూల్యమైనవని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్ డి. జ్వాలా సాగర్, ఎ.ఇ. కె.శ్రీనివాసు, ములపర్తి బాలకృష్ణ, కట్టా సత్తిబాబు , విత్తనాల రవితేజ, సి.ఎం.ఎం. ఎస్.భాష్కర్, ఎస్.ఐ. జి.రాజీవ్ గాంధీ, ఎస్.హెచ్.జి.మెంబర్స్ , సచివాలయ సెక్రటరీలు , మెప్మా మరియు నగర పంచాయతి సిబ్బంది పాల్గొన్నారు.

## గృహప్రవేశానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే



**తుగ్గలి జూన్ 20(మనం న్యూస్):** తుగ్గలి మండలంలోని పెండేకల్ గ్రామానికి చెందిన వైఎస్ఆర్సిపి నేత అట్లా బసిరెడ్డి నూతన గృహప్రవేశ కార్యక్రమానికి పత్తికొండ మాజీ శాసనసభ్యురాలు కంగాటి శ్రీ దేవమ్మ హాజరయ్యారు.నూతన గృహంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో కుటుంబం అభివృద్ధి చెందాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు అట్లా గోపాల్ రెడ్డి, పెండేకల్ భాస్కర్ రెడ్డి, తుగ్గలి శ్రీనివాసులు రెడ్డి, రాతన మోహన్ రెడ్డి, ఎర్రగుడి రామచంద్ర రెడ్డి, తుగ్గలి మోహన్ రెడ్డి, తుగ్గలి చంద్రశేఖర్ రెడ్డి, జిట్టా నగేష్ యాదవ్, పులికొండ నాయక్, నారాయణ నాయక్, శభాష్ పురం హనుమంతు, ఉమా మహేశ్వర్ రెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, రంజన్ వలి తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాతల సంక్షేమమే ధ్యేయం...



**తుగ్గలి జూన్ 20(మనం న్యూస్ ):** అన్నదాతల సంక్షేమమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని తెదేపా సీనియర్ నేత, మాజీ సర్పంచ్ మసాలా శ్రీను అన్నారు. శనివారం రామకొండ సేవా కేంద్రంలో రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలను అయన హాజరై రైతులకు అందించారు. మాజీ సర్పంచ్ మసాలా శ్రీను మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని పేర్కొన్నారు.వ్యవసాయ రంగాన్ని తిరిగి బలోపేతం చేసి, ప్రతి రైతు కుటుంబంలో వెలుగులు నింపే వరకు శ్రమిస్తామని, సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఏపీ అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చాంద్బాషా, ప్రసాద్, అగ్రికల్చర్ అసిస్టెంట్ మహమ్మద్ జాకీర్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.

## రైతులకు యూరియా ఎరువులు అందజేత



**మంత్రాలయం , జూన్ 20,మనం న్యూస్ :-** మంత్రాలయం మండల పరిధిలోని చెట్నెహళ్ళి గ్రామంలో ఉన్న రైతు సేవా కేంద్రంలో టీడీపీ ఇన్చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి ఆదేశాలు మేరకు మంచాల సొసైటీ డైరెక్టర్ చాపల నాగేష్ రైతులకు శనివారం యూరియా ఎరువులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అన్ని విధాలుగా రైతులకు అండగా నిలుస్తోందన్నారు. మంత్రాలయం మండలంలో యూరియా ఎరువులు కొరత లేకుండా టీడీపీ ఇన్చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి చొరవ తీసుకున్నారని , ప్రతి రైతుకు యూరియా అందించడమే ఆయన లక్ష్యం అన్నారు. రైతుల వివరాలను ఆన్లైన్లో నమోదు చేసి, ఓటీపీ విధానం ద్వారా పారదర్శకంగా ఎరువులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రైతులు , వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

## అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలి




**ఎమ్మిగనూరు జూన్ 20 మనం న్యూస్:** మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేసి రిటైర్మెంట్ వయసును 62 సంవత్సరాలు పెంచాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం చేపట్టడం జరిగిందని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎల్లప్ప,శివ ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు విజయేంద్ర, నరసింహారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల తరబడి మున్సిపల్ పరిధిలో చాలీచాలని జీతాలకు పనిచేయడం జరుగుతుందని అనేక ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో వైఫల్యం చెందాయని తెలిపారు.

# మంత్రాలయం టీడీపీ బాధ్యులు ఎన్. రాఘవేంద్ర రెడ్డి



**మంత్రాలయం ,జూన్ 20,మనం న్యూస్ ;-** మంత్రాలయం మండల కేంద్రంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాల ను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని మంత్రాలయం టీడీపీ బాధ్యులు ఎన్. రాఘవేంద్ర రెడ్డి అన్నారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన మంత్రాలయంలోని రాఘవేంద్రపురంలో ఉన్న అంగన్వాడీ కేంద్రం-3 ను మంత్రాలయం జనసేన పార్టీ ఇన్చార్జ్ బి లక్ష్మన్న తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేసి వసతులు, చిన్నారులకు అందుతున్న సేవలు, పరిశుభ్రత, పోషకాహార కార్యక్రమాల అమలు తీరును పరిశీలించి ,అక్కడి పరిస్థితుల పై సిడిపిఓ రాజేశ్వరి దేవి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యం, విద్య, పోషకాహారం ప్రతి కుటుంబ భవిష్యత్తుకు పునాది అంగన్వాడీ కేంద్రాలు అని , మరింత మెరుగైన సేవలు అందించేలా అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తాన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో, గ్రామాలోని ప్రభుత్వ సంస్థల పనితీరును నిరంతరం పరిశీలిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడం తమ బాధ్యతగా భావిస్తున్నామన్నారు.అనంతరం అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారులతో ఆప్యాయంగా ముచ్చటించి, వారి ఆరోగ్యం, విద్యాభివృద్ధిపై ఆరా తీశారు. చిన్నారులతో కలిసి అంగన్వాడీలో భోజనం చేస్తూ వారికి అందిస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించారు.

# అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే



**ఎమ్మిగనూరు జూన్ 20 మనం న్యూస్** పట్టణంలోని 12వ వార్డు మారెమ్మకొండ సమీపంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. అక్కడ చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, వంటగది, బాత్రూమ్లు, పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం అంగన్వాడీ వంటగదిలో భోజన ఏర్పాట్లలో స్వయంగా పాల్గొని, అంగన్వాడీ సిబ్బందితో కలిసి చిన్నారులకు భోజనం వడ్డించి ఆప్యాయంగా తినిపించారు. అనంతరం విద్యార్థులు, అంగన్వాడీ సిబ్బంది, స్థానిక ప్రజలతో కలిసి పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్యం పట్ల సామాజిక బాధ్యతను పెంపొందించేలా పరిశుభ్రత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బి.వి. జయ నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ఆరోగ్యకరమైన, సంపన్నమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, పరిశుభ్రత, పారిశుద్ధ్యం, సామాజిక భాగస్వామ్యాన్ని ప్రభుత్వం చురుగ్గా ప్రోత్సహిస్తోందని తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు నిర్దేశించిన స్వచ్ఛాంధ్ర - ఆరోగ్యాంధ్ర - ఐశ్వర్య ఆంధ్ర లక్ష్యాన్ని సాకారం చేయడానికి ప్రజలందరినీ భాగస్వాములను చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు, అంగన్వాడీ టీచర్, ఆయా, 12వ వార్డు ఇన్చార్జి, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్చార్జి, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## యువకుల మధ్య తగాదా! కత్తితో దాడి



**మంత్రాలయం , జూన్ , 20 ( మనం న్యూస్);-** మండల కేంద్రమైన మంత్రాలయంలోని పాత ఊరులో ఇద్దరు యువకుల మధ్య జరిగిన తగాదా కత్తి పోటుకు దారి తీసింది. అసలు గొడవ ఎందుకు జరిగిందనే విషయం బయటకు తెలియాల్సి ఉంది. శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో మాజీ సర్పంచ్ తెల్లబండ భీమయ్య ఇంటి ముందు బైక్ పై వెళ్తున్న తెలుగు ఈరన్న ను ఈ సమయంలో ఎందుకు వచ్చావని మాజీ సర్పంచ్ తమ్ముడు ప్రాణేష్ అసభ్యంగా మాట్లాడం వల్ల అవమానంగా భావించిన తెలుగు ఈరన్న బంధువులు తెలుగు రాఘవేంద్ర, తెలుగు ఉరుకుంద లతో కలిసి గ్రామ మాజీ సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య తమ్ముడు తెల్లబండ్ల ప్రాణేష్ అడగడానికి వెళ్ళాగా ఇద్దరి మధ్య మాటమాట పెరిగి ఒకరి పై ఒకరు దాడి చేసుకోగా ఆగ్రహంతో ప్రాణేష్ తెలుగు ఈరన్న పై కత్తితో పొట్టలో గొంతు పై దాడి చేశాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను చెదర గొట్టారు. గాయపడిన ఈరన్న ను ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రైవేటు హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మల్లికార్జున తెలిపారు.

## పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- **ఈఆర్డిఓ ఉపేంద్ర రెడ్డి**

**మంత్రాలయం , జూన్, 20మనం న్యూస్ ;-** ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈఆర్డిఓ ఉపేంద్ర రెడ్డి , ఎంపీటీసీ బోయ వెంకటేష్ ప్లానింగ్ అధికారి రాజ లు అన్నారు. శనివారం నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయం లోనిమంచాల గ్రామ పంచాయితీ నందు స్వేచ్ఛాంధ్ర , స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటికి పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉంచాలని లేకుంటే దోమలు చేరి అనారోగ్యానికి గురవుతారన్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో నుంచి రాఘవేంద్ర కూడలి వరకు ర్యాలీ నిర్వహించి , స్వేచ్ఛత పై ప్రతిజ్ఞ చేశారు. చీపురు పట్టి రోడ్డు చెత్తను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో యంఈఓ రాఘున్న , సచివాలయం సిబ్బంది , మరియు శానిటేషన్ సిబ్బంది ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




## ప్రవేట్ కార్పొరేట విద్యాసంస్థల ఫీజుల దోపిడిని అరికట్టాలి




**ఎమ్మిగనూరు జూన్ 20 మనం న్యూస్** పట్టణ గ్రామీణ ప్రాంతాలలో ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడిని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షుడు గఫూర్ అధ్యక్షతన స్థానిక వైయస్సార్ సర్కిల్ నందు ధర్నా నిర్వహించడం జరిగింది ధర్నా కార్యక్రమానికి ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ షాబీర్ భాష మాట్లాడుతూ ఈ ధర్నాను ఉద్దేశించి పట్టణంలో ఉన్నటువంటి ప్రవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలో అక్రమ ఫీజుల దోపిడిని అరికట్టడంలో విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు కొన్ని విద్యాసంస్థల కైతే ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతులు లేకున్నా అడ్మిషన్లు చేసుకుని అక్రమంగా విద్యార్థి తల్లిదండ్రుల నుండి వేలాది రూపాయలు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులపై తీవ్ర ఒత్తిడి తీసుకొస్తున్నారు ప్రభుత్వా నియమ నిబంధనలు ఉల్లంఘించి అక్రమ ఫీజులు దోపిడి చేస్తున్నప్పటికీ పట్టణంలోఉన్నటువంటి విద్యాశాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం ప్రవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల ఆగడాలకు నిదర్శనం అన్నారు

## పీఎం కిసాన్ -అన్నదాతా సుఖీభవ మొదటి విడత నిధుల పంపిణీ




- **ఎమ్మెల్యేబొగ్గుల దస్తగిరి**

**కర్నూలు జూన్ 20మనం న్యూస్** కోడుమూరు నియోజకవర్గం గూడూరు లో శనివారం రెండవ ఏడాది పీఎం కిసాన్ -అన్నదాతా సుఖీభవ మొదటి విడత నిధుల పంపిణీ కార్యక్రమంలో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దస్తగిరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పీఎం కిసాన్ -అన్నదాత సుఖీభవ పథకం ద్వారా తొలి ఏడాది అమలు చేసిందని, రెండవ ఏడాది కూడా మొదటి విడతలో భాగంగా రాష్ట్రంలోని 46,85,838 మంది రైతు కుటుంబాల ఖాతాల్లో ఈరోజు జమ చేశామన్నారు. మొత్తం 3,125 కోట్లు జమ చేయడం జరుగుతుందని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రైతులను మోసం మోసం చేసిందని విమర్శించారు. గత ప్రభుత్వం 5 ఏళ్లలో ఇచ్చిన మాట ప్రకారం రైతులకి ఇవ్వకపోగా కూటమి ప్రభుత్వం ఒక్క ఏడాదిలోనే 8,985 కోట్లు ఇచ్చి తామే నిజమైన రైతు పక్షపాతి ప్రభుత్వమని నిరూపించిందన్నారు. రానున్న రోజుల్లో కూడా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ కూటమి నాయకులు కార్యకర్తలు రైతులు, ప్రభుత్వ అధికారులు వ్యవసాయ శాఖ అధికారులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాస్థాయిలో ప్రతిభ చాటిన ఎరిగేరి హై స్కూల్ విద్యార్థి శ్రీధర్




**కౌతాళం జూన్ 20 మనం న్యూస్:** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో ప్రతిభ చాటిన ఎరిగేరి విద్యార్థిఅంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్),కర్నూలు ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఆరోగ్యానికి యోగ - పాఠశాలలో యోగ' పోస్టర్ మేకింగ్ పోటీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (పియం శ్రీ),ఎరిగేరికి చెందిన పదవ తరగతి విద్యార్థి వై.శ్రీధర్ విశేష ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో మూడవ స్థానం సాధించాడు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వై. శ్రీధర్ కు నగదు బహుమతి మరియు ప్రశంసా పత్రాన్ని అందజేసి సత్కరించారు. విద్యార్థి సాధించిన ఈ విజయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.రమేష్ నాయుడు, కౌతాళం మండలం విద్యాశాఖ అధికారులు రామాంజనేయులు మరియు శ్రీమతి శోభారాణి హర్షం వ్యక్తం చేస్తూ, యోగ యొక్క ప్రాముఖ్యతను ప్రతిబింబించే విధంగా రూపొందించిన పోస్టర్ విద్యార్థి సృజనాత్మకతకు నిదర్శనమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.రమేష్ నాయుడు పాల్గొని విద్యార్థిని అభినందించారు. విద్యార్థి విజయానికి సహకరించిన ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను ప్రశంసిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,ఎరిగేరి విద్యార్థి జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరచడం పాఠశాలకు గర్వకారణమని ఉపాధ్యాయులు, పాఠశాల విద్యా కమిటీ మరియు గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.



## సర్ కు ప్రజలు సహకరించాలి

**కౌతాళం, జూన్ 20 మనం న్యూస్** కౌతాళం మండల పరిధిలోనే వల్లూరు గ్రామంలో నిర్వహిస్తున్న సర్ మ్యాపింగ్ కార్యక్రమాన్ని బూత్ నెంబర్ 13,14 లోశనివారం రోజున నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి అడివప్ప గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడివప్ప గౌడ్ మాట్లాడుతూ మ్యాపింగ్ ప్రక్రియ పురోగతి క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరు మరియు నమోదవుతున్న వివరాలను పరిశీలించడం జరిగిందని తెలిపారు. ఎన్నికలు సంఘం నిబంధనలు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించాలని ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహించారని తెలిపారు. సర్ 2025 కార్యక్రమం విజయవంతంగా అములు కావాలంటే క్షేత్రస్థాయి సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించి కచ్చితమైన వివరాలను సేకరిస్తారని తెలిపారు. ముఖ్యంగా సమాచారాన్ని జాగ్రత్తగా ధ్రువకరించాలని సిబ్బందికి సూచించారు. ఎలాంటి పొరపాటు లేకుండా పనులను పూర్తి చేసి ఓటర్ జాబితా సమగ్రతను కాపాడాలని సూచించారు.

## మొహర్రం పండుగను ప్రశాంతత వాతావరణం జరుపుకోవాలి

- **మంత్రాలయం సిఐ , దస్తగిరిబాబు**

**మంత్రాలయం , జూన్ 20,మనం న్యూస్ ;-** ప్రశాంతత వాతావరణం లో కులమతాలకు అతీతంగా మొహర్రం పండుగను జరుపుకోవాలని మంత్రాలయం సిఐ దస్తగిరిబాబు సూచించారు. శనివారం మండల పరిధిలోనిమాధవరం పోలీసు స్టేషన్ లో రచ్చుమర్రి , తదితర గ్రామాల ప్రజలు తో మొహర్రం పండుగ గురించి సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొహర్రం పండుగకు తప్పనిసరిగా పోలీసుల అనుమతి ఉండాలన్నారు. మొహర్రం పండుగ సందర్భంగా గ్రామాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చూడలన్నారు. ఎవరైనా ఎక్కడైనా మద్యం సేవించి అల్లర్లకు పాల్పడితే వారిపై చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ,అంతే కాకుండా అట్టి వారిపై రౌడీ షీట్ లు ఓపెన్ చేయడం జరుగుతుందన్నారు. గ్రామాలలో ఎవరూ కూడా మద్యం అమ్మరాదని ,ఎవరైనా మద్యం అమ్మితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ,గ్రామాలలో ఎక్కడైనా గొడవలు చేస్తే గొడవలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడమే కాకుండా ఆ గ్రామాల్లో తర్వాత ఎలాంటి పండుగలకు అనుమతి వుండదని, కాబట్టి ఎవరూ గొడవలు చేయకుండా ప్రశాంత వాతావరణం లో మొహర్రం పండుగను జరుపుకోవలన్నారు. ఈ సమావేశంలో మాధవరం ఎస్ఐ విజయకుమార్ , పోలీసు సిబ్బంది ఉన్నారు.





## రాఘవేంద్రుని సన్నిధిలో ఎస్బీఐ కర్నూలు రీజినల్ మేనేజర్

- **ప్రభుత్వ పాఠశాలకు 6 ఫ్యాన్లు విరాళం**

**మంత్రాలయం జూన్ 20,మనం న్యూస్ :** ఆధ్యాత్మిక క్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం ఎస్బీఐ బ్యాంక్ కర్నూల్ రీజినల్ మేనేజర్ సురేష్ బాబు శనివారం మంత్రాలయంకు వచ్చారు. వీరికి మంత్రాలయం ఎస్బీఐ బ్యాంక్ మేనేజర్ రాజశేఖర్ , రామచంద్రనాయక్ స్వాగతం పలికారు. శ్రీమఠం చేరుకున్న వీరు ముందుగా గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని ,రాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్ని దర్శించుకున్నారు. పీఠాధిపతి సుభుదేంద్ర తీర్థులు వీరికి శేష వస్త్రం, ఫలమంత్రాక్షింతలు ఇచ్చి ఆశీర్వదించారు. అనంతరం మండల పరిధిలోని సూగూరు గ్రామంలో జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు మంత్రాలయం బ్రాంచ్ మేనేజర్ రాజశేఖర్ తో కలిసి కర్నూలు రీజనల్ మేనేజర్ సురేష్ బాబు 6 ఫ్యాన్లను విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రాలయం ఎస్బీఐ బ్యాంక్ అధికారులు, సిబ్బంది రామచంద్రనాయక్, జి. నరేంద్ర, యు. నరేంద్ర, శ్రీనివాసులు, ఉరుకుందప్ప, నీలకంఠ, రాఘవేంద్ర, సూగూరు పాఠశాల ప్రధానోపాధ్యాయులు లచ్చప్ప, పాఠశాల సిబ్బంది, ఎస్బీఐ బ్రాంచ్ సిబ్బంది సద్దాం, మహబూబ్ తదితరులు ఉన్నారు.

## రెవెన్యూశాఖ అత్యంత కీలకం



- **'తహసీల్దార్ ఎస్. రవి**

**తుగ్గలి జూన్ 20(మనం న్యూస్ ):** ప్రజాస్వామ్యంలో రెవెన్యూ శాఖ అత్యంత కీలకమని తహసీల్దార్ ఎస్.రవి అన్నారు.1786లో బోర్డ్ ఆఫ్ రెవెన్యూ ఆవిర్భావం పురస్కరించుకుని జూన్ 20న జరుపుకునే రెవెన్యూ దినోత్సవాన్ని తుగ్గలి తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు.తహసీల్దార్ మాట్లాడుతూ బ్రిటీష్కాలం నుంచి ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా రెవెన్యూశాఖ పనిచేస్తోందని తెలిపారు .ప్రజలకు రెవెన్యూ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యమని తెలిపారు. భూ సమస్యలు, ఆదాయ ధ్రువపత్రాలు, సంక్షేమ పథకాల అమలులో రెవెన్యూ శాఖ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.ప్రజలకు పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందించేందుకు సిబ్బంది కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీటీ సుదర్శన్, ఆర్ఐ వెంకటరాముడు,సీనియర్ సంచాలకులు రాముడు, సుధాకర్ రెడ్డి, వీఆర్వోలు నాగలక్ష్మి,నవీద్ పటేల్, అనంత్ స్వరూప్, గ్రామ సర్వేయర్లు, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

# వన్డే సిరీస్ భారత్ కైవసం



## అదిరిపోయేలా.. శ్రద్ధ నృత్య ప్రదర్శన

'స్త్రీ 2'తో రెండేళ్ల క్రితం బాక్సాఫీస్ వద్ద వసూళ్లతో మ్యాజిక్ చేసింది బాలీవుడ్ కథానాయిక శ్రద్ధా కపూర్. ఈ సినిమా విజయం తర్వాత ఇప్పటి వరకూ ఆమె ఏ ప్రాజెక్టును అధికారికంగా ప్రకటించకపోయినా.. లక్ష్మణ్ ఉటేకర్ తెరకెక్కిస్తున్న ఓ చిత్రంలో శ్రద్ధ నటిస్తున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. దీనికి 'ఈథ' అనే పేరును ఖరారు చేసినట్లు తెలుస్తోంది. తాజాగా ఈ సినిమా టీజర్ను 'కాక్టెయిల్ 2' చిత్రం ప్రదర్శితమవుతోన్న థియేటర్లలో విడుదల చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ టీజర్కు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. ఇందులో శ్రద్ధ.. అదిరిపోయేలా నృత్య ప్రదర్శన ఇస్తూనే.. మరోవైపు స్టేనే ప్రసవ వేదన పడుతూ బిడ్డకు జన్మనివ్వడం లాంటి సన్నివేశాలతో ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతోంది టీజర్. మహారాష్ట్రకు చెందిన జానపద నృత్య కళాకారిణి విఠాబాయి భావు మాంగ్ నారాయణ్గావ్కర్ జీవితం ఆధారంగా దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు సమాచారం.





చెన్నై వేదికగా జరిగిన మూడో వన్డేలో భారత యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ అద్భుత శతకంతో చెలరేగాడు. కెప్టెన్ రోహిత్ శర్మతో కలిసి ప్రత్యర్థి బౌలర్లను ఊచకోత కోస్తూ భారత్కు 9 వికెట్ల తేడాతో భారీ విజయాన్ని అందించాడు. ఈ విజయంతో టీమిండియా సొంతగడ్డపై మరో చిరస్మరణీయమైన సిరీస్ విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది.

ఆఫ్ఘనిస్తాన్ నిర్దేశించిన లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన భారత జట్టుకు ఓపెనర్లు అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చారు. ముఖ్యంగా యువ సంచలనం యశస్వి జైస్వాల్ మైదానం నలుమూలలా బౌండరీల వర్షం కురిపించాడు. కేవలం 86 బంతులు ఎదుర్కొన్న జైస్వాల్ 14 ఫోర్లు, 3 భారీ సిక్సర్ల సాయంతో 110 పరుగులు చేసి నాటౌట్గా నిలిచాడు. వన్డే క్రికెట్లో తన మార్కు క్లాస్, మాస్ షాట్లతో ఆఫ్ఘన్ బౌలింగ్ విభాగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తూ అజేయ శతకంతో జట్టును విజయతీరాలకు చేర్చాడు.

### అండగా నిలిచిన కెప్టెన్ రోహిత్ శర్మ

మరోవైపు కెప్టెన్ రోహిత్ శర్మ కూడా తనదైన శైలిలో విరుచుకుపడ్డాడు. జైస్వాల్కు అండగా నిలుస్తూనే స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. రోహిత్ శర్మ 69 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 79 పరుగుల అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. వీరిద్దరి మధ్య నమోదైన భారీ భాగస్వామ్యంతో భారత్ విజయం ఎప్పుడో ఖాయమైపోయింది. అయితే సెంచరీ వైపు దూసుకెళ్తున్న రోహిత్.. మహమ్మద్ నబి బౌలింగ్లో ప్రత్యామ్నాయ ఫీల్డర్ సెదిఖుల్లా అటల్ చేతికి చిక్కి అవుటయ్యాడు. దాంతో భారత్ తొలి వికెట్ను కోల్పోయింది.

### కేవలం 28.4 ఓవర్లలోనే మ్యాచ్ ముగింపు

రోహిత్ అవుటైన తర్వాత క్రీజులోకి వచ్చిన శ్రేయస్ అయ్యర్ ఏమాత్రం ఒత్తిడికి లోనవకుండా వేగంగా ఆడాడు. అయ్యర్ 19 బంతుల్లో 2 సిక్సర్ల సాయంతో 20 పరుగులు చేసి నాటౌట్గా నిలిచాడు. భారత్ కేవలం 28.4 ఓవర్లలోనే 1 వికెట్ నష్టానికి 224 పరుగులు చేసి ఘన విజయం సాధించింది. ఆఫ్ఘన్ బౌలర్లలో మహమ్మద్ నబికి మాత్రమే ఒక వికెట్ దక్కింది. మిగతా బౌలర్లు ఎవరూ కూడా భారత బ్యాటర్లను అడ్డుకోలేకపోయారు.



## లియోనెల్ మెస్సిపై చర్యలు తీసుకోవాలి

### అల్జీరియా ఫిర్యాదు

ఫిఫా ప్రపంచ కప్ 2026 తొలి మ్యాచ్లోనే అర్జెంటీనా స్టార్ లియోనెల్ మెస్సి హ్యాట్రిక్ కొట్టాడు. దీంతో అర్జెంటీనా 3-0 తేడాతో అల్జీరియాను చిత్తు చేసింది. అయితే, మెస్సిపై అల్జీరియా వరల్ కప్ నిర్వాహకులకు ఫిర్యాదు చేసినట్లు వార్తలు వస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా మెస్సి వ్యవహరించినా.. రెడ్ కార్డు ఇవ్వలేదని అల్జీరియా ఆరోపించింది. తాజాగా ఫిఫా వద్ద అధికారికంగా ఫిర్యాదు చేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

మెస్సి కాలు అల్జీరియా కెప్టెన్ మాండీ పిక్కను తాకినట్లు వీడియోల్లో కనిపించిందని.. అయినా సరే రిఫరీ చర్యలు తీసుకోలేదని ఫిర్యాదు లేఖలో అల్జీరియా పేర్కొంది. ఇక అర్జెంటీనా మిడ్ఫీల్డర్ అలెక్సిస్ అలిస్టర్ కూడా తమ ఆటగాడు ఇబ్రహీం మజా మోచేతిని తాకినట్లు అల్జీరియా ఆరోపణలు చేసింది. ఈ మ్యాచ్కు పోలాండ్కు చెందిన షిమోన్ మార్సినియక్ రిఫరీగా వ్యవహరించాడు.

అర్జెంటీనా-ఫ్రాన్స్ మధ్య జరిగిన 2022 ప్రపంచ కప్ ఫైనల్కూ అతడే రిఫరీ కావడం గమనార్హం.



## ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్‌కు హార్దిక్ దూరం!

ఇప్పటికే అఫ్గానిస్థాన్తో వన్డే సిరీస్కు దూరమైన భారత ఆల్రౌండర్ హార్దిక్ పాండ్య ఇంగ్లాండ్తో సిరీస్కూ దూరం కానున్నట్లు తెలుస్తోంది. ఐపీఎల్ సమయంలో తగిలిన గాయం నుంచి అతడు పూర్తిగా కోలుకోలేదని వార్తలు వస్తున్నాయి. అందుకు ఇంకా సమయం కావాలని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అభిప్రాయపడుతున్నట్లు సమాచారం. ఐదు టీ20లు, మూడు వన్డేలు ఆడేందుకు భారత్ జట్టు ఇంగ్లాండ్ వెళ్లనుంది. జులై 1 నుంచి మ్యాచ్లు ప్రారంభం కానున్నాయి. సుదీర్ఘ విరామం తర్వాత ఈ ఫార్మాట్లోకి పునరాగమనం చేయడానికి పాండ్య ఎదురు చూస్తున్నాడు.

దీంతో సెలెక్టర్లు ఈ సిరీస్కు పాండ్యకు బదులుగా మరో ఆటగాడిని ఎంపిక చేయాల్సిన పరిస్థితి నెలకొంది. పేస్ బౌలింగ్ ఆల్రౌండర్గా హార్దిక్ పాండ్య పరిమిత ఓవర్ల క్రికెట్లో కీలక ఆటగాడిగా కొనసాగుతున్నాడు. అయితే, గాయం కారణంగా వన్డే సిరీస్లకు అందుబాటులో లేకపోవడం అతడి అవకాశాలకు దెబ్బతీయనుంది.

వచ్చే ఏడాది దక్షిణాఫ్రికా వన్డే ప్రపంచ కప్ జరగనుంది. ఈ క్రమంలో పాండ్యను ఫిట్గా ఉంచాల్సిన అవసరం ఉందని సెలక్షన్ కమిటీ ఛైర్మన్ అజిత్ అగార్కర్ ఇటీవల పేర్కొన్నారు. అతడిని తాము ఎప్పుడైనా గ్రౌండ్లోకి తీసుకువచ్చే అవకాశం ఉందన్నారు.

## మెగా అభిమానులకు సర్ప్రైజ్.. ఇదిగో చిన్నారి క్లీంకార



మెగా అభిమానులకు ఊహించని సర్ప్రైజ్. రామ్చరణ్, ఉపాసనల ముద్దుల బిడ్డ క్లీంకారను ఎప్పుడెప్పుడు చూస్తామా? అని ఎదురు చూసిన వారి కల నెరవేరింది. మూడో పుట్టినరోజు సందర్భంగా క్లీంకారకు శుభాకాంక్షలు చెబుతూ చిన్నారి ఫొటోను ఉపాసన సోషల్మీడియా వేదికగా పంచుకున్నారు. అటు ఉపాసన, అటు రామ్చరణ్ క్లీంకారను ఇరు వైపులా ఎత్తుకుని నిలబడగా, చిరునవ్వులు చిందిస్తూ చిన్నారి కనిపించింది. ప్రస్తుతం ఈ ఫొటో సామాజిక మాధ్యమాల వేదికగా వైరల్ అవుతోంది. క్లీంకార 2023 జూన్ 20న జన్మించగా, ఈ ఏడాది ఫిబ్రవరిలో చరణ్, ఉపాసన దంపతులకు కవలలు జన్మించారు. అబ్బాయికి శివరామ్, అమ్మాయికి అన్వీరా దేవి అని పేరు పెట్టిన సంగతి తెలిసిందే.

## సోషల్ మీడియాకి బ్రేక్.. 'డ్రాగన్' బ్యూటీ సడెన్ నిర్ణయం!

తన కెరీర్ ఆరంభంలోనే మంచి గుర్తింపును అందుకున్న యంగ్ హీరోయిన్స్ లో కోలీవుడ్ డ్రాగన్ బ్యూటీ కయాదు లోహర్ కూడా ఒకామె. అయితే కయాదు ఇప్పుడు తమిళ్ సహా తెలుగు మలయాళ సినిమాల్లో కూడా బిజీగా వుంది. ఇటీవల 'పళ్ళి చట్టంబి'లో పలకరించిన బ్యూటీ సడెన్ గా ఓ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. ఇక నుంచి కొన్నాళ్ల పాటుగా తను సోషల్ మీడియా నుంచి బ్రేక్ తీసుకోవాలని డిసైడ్ అయినట్టు తెలిపింది.

సోషల్ మీడియా నుండి ఒక చిన్న అడుగు వెనక్కి వేస్తున్నాను. కొన్నిసార్లు, మన శరీరాలకు మనం ఇచ్చే విశ్రాంతి ఇచ్చేలానే మనస్సుకు కూడా విశ్రాంతి అవసరం. నేను వేగాన్ని తగ్గించుకోవాలని, కొంతకాలం డిస్ కనెక్ట్ అయ్యి స్క్రీన్ దాటి తనతో తను ఎక్కువ సమయం గడపాలని భావిస్తున్నాను. తనకు ఇప్పటివరకు సహకరించిన అందరికీధన్యవాదాలు తెలుపుతూ త్వరలో కలుద్దాం అని ముగించింది. సో కొన్నాళ్ల పాటు ఈ యంగ్ బ్యూటీ సోషల్ మీడియాలో ఉండదని చెప్పాలి. ప్రస్తుతం అయితే తెలుగులో నాచురల్ స్టార్ నానితో ది ప్యారడైజ్ అనే భారీ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే.





## 'సింగ్ గీతం' కోసం కల్కి.. మాటతో పాట అంటున్న ప్రభాస్!




ఇటీవల మన తెలుగు సినిమా నుంచి వచ్చిన వినూత్న ప్రయత్న చిత్రమే సింగ్ గీతం. భారతీయ సినిమా దగ్గర ఎన్నో వండర్స్ తీసిన లెజెండరీ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు తెరకెక్కించిన ఈ ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్ ఆడియెన్స్ నుంచి మంచి రెస్పాన్స్ అందుకుంది. అలా మాటతోనే పాటని సృష్టించి థియేటర్స్ లో అలరించిన టీం కోసం ఇప్పుడు కల్కి పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కూడా భాగం అవ్వడం జరిగింది. 'నా వాయిస్లో ఏదైనా సమస్య ఉందా? నాకు పాటలు పాడటం రాదనుకున్నారా? నేను ప్రయోగాలు చేయలేదా? నన్ను ఎందుకు 'సింగ్ గీతం'లో పెట్టుకోలేదు?'' అని నాగ్అశ్విన్ను ప్రభాస్ సరదాగా ప్రశ్నించారు. ఈ సినిమా నిర్మాత అలాగే కల్కి దర్శకుడు నాగ్ అశ్విన్ ప్రభాస్ తో కలిసి చేసిన చిట్ చాట్ ఇప్పుడు వైరల్ గా మారింది. మాటతో పాట అంటూ నాగ్ అశ్విన్ తో ప్రభాస్ అరిపించడం ఫ్యాన్స్ లో మంచి క్రేజీగా మారింది. ఇక ఇందులో ప్రభాస్ లుక్స్ కూడా మంచి స్టైలిష్ గా కనిపించడంతో ఈ ప్రోమో మరింత వైరల్ అయ్యింది. ఇక ఈ ఫుల్ ఇంటర్వ్యూ త్వరలోనే రానుంది అని వైజయంతి మూవీస్ వారు కన్ఫర్మ్ చేశారు. ఇక దేవిశ్రీప్రసాద్ ఈ ప్రాజెక్ట్‌కి సంగీతం అందించిన సంగతి తెలిసిందే.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No.New:3-88, Old : 3-22, Chandra Theatre, Gosala, Penamaluru Mandal, Krishna District,(AP),Pin -521151, And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.